

జగన్ వీకెండ్ రాజకీయ నాయకుడు. మోసాలు, అబద్ధాలే ఆయన రాజకీయాలకు ఆధారం. రాష్ట్ర అభివృద్ధిపై ఆయనకు దృష్టి లేదు. ఐదేళ్ల పాలనలో దోపిడీ మాత్రమే జరిగింది. వైసీపీ అసమర్థ పాలనతో వ్యవస్థలు దెబ్బతిన్నాయి. చంద్రబాబు విజన్ వల్లే ఐటీ రంగంలో తెలుగు రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


మంగళవారం 19.05.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 27 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# సాగునీటి రంగానికి అగ్రతాంబూలం!



- ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల పనులు
- పోలవరం ఎడమ కాల్వ-చంపావతి లింక్ పై అధ్యయనం
- 2027 ఏప్రిల్ నాటికి పోలవరం నిర్వాసితుల తరలింపు పూర్తి
- జలధార-జలహరతి పనులకు అధిక ప్రాధాన్యత
- సీజన్ ఆలస్యం కాకుండా కాల్వలకు నీటి విడుదల
- ఇరిగేషన్ క్యాలెండర్ లో మరో 11 ప్రాజెక్టులకు ప్రాధాన్యత
- జలవనరుల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకారం ప్రాజెక్టుల నిర్మాణం, శంకుస్థాపనలు చేపట్టేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యతా క్రమంలో ఈ ప్రాజెక్టులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్సులో 25 ఇరిగేషన్ ప్రాజెక్టులతో ఇరిగేషన్ క్యాలెండర్ ను సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ క్రమంలో సోమవారం రాష్ట్ర సచివాలయంలో పోలవరం సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. దీంట్లో భాగంగా ఇరిగేషన్ క్యాలెండర్ అంశంపై చర్చించారు. గతంలో ప్రకటించిన ప్రాజెక్టులు కాకుండా...ప్రాధాన్యత కలిగిన మరో 11 ప్రాజెక్టుల పనులు కూడా చేపట్టాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు. ఆ మేరకు ఆ 11 ప్రాజెక్టులను ఇరిగేషన్ క్యాలెండరులో చేర్చాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, సివిల్ వర్క్స్ వంటి వాటికి ఎలాంటి నిధుల కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆర్థిక శాఖ అధికారులను సూచించారు. గతంలో ప్రకటించిన 25...సమీక్షలో ప్రకటించిన 11 ప్రాజెక్టులను ప్రాధాన్యతా ప్రాజెక్టులుగా తీసుకుని ప్రకటించిన ఇరిగేషన్ క్యాలెండర్ కు అనుగుణంగా పనులు చేపట్టాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.

**నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పోలవరం పనులు :** సమీక్షా సమావేశం సందర్భంగా పోలవరం సహా వివిధ సాగు నీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పోలవరం ప్రాజెక్టులో సివిల్ వర్క్స్ 88 శాతం పూర్తి అయ్యాయని అధికారులు వెల్లడించారు. భూసేకరణ 93 శాతం పూర్తైందని...నిర్వాసితుల తరలింపు 45 శాతం పూర్తి అయ్యిందని చెప్పారు.

మిగతా 2లో...

## వేటకు విరామం... సర్కారు సాయం



- గంగపుత్రులకు రెండో ఏడాది అండగా ప్రజాప్రభుత్వం
- 'మత్స్యకారుల సేవలో' కింద ప్రతీ కుటుంబానికి రూ.20 వేలు జమ
- 1.30 లక్షల కుటుంబాలకు రూ.262 కోట్లు లబ్ధి
- కావలిలో నేడు నిధులు విడుదల కార్యక్రమానికి ముఖ్యమంత్రి

2 లో

## 'స్త్రీ శక్తి' సూపర్ హిట్..



- మహిళలకు అండగా ఆర్టీసీ... స్త్రీ శక్తి పథకంతో ఆర్థిక వెసులుబాటు
- స్త్రీ శక్తితో ఆర్టీసీకి పెరిగిన ఆక్యుపెన్సీ
- స్త్రీ శక్తితో తగ్గిన మరణాలు... ప్రమాదాలు
- స్త్రీ శక్తి లబ్ధిదారులకు సరాసరి నెలకు రూ. 2 వేలకు పైగా ఆదా
- 9 నెలల్లో 67 కోట్ల ఉచిత ప్రయాణాలు... రూ. 2350 కోట్ల సబ్సిడి
- 25 లక్షల ఉచిత ప్రయాణాలు చేసిన దివ్యాంగులు
- సంక్షేమ చరిత్రలో ఆర్టీసీకి ప్రత్యేక స్థానం కల్పించిన కూటమి ప్రభుత్వం
- ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం... ప్రయాణీకుల సౌకర్యమే లక్ష్యంగా అడుగులు

• వివరాలు 2 లో

## నీటిపారుదల రంగానికి కొత్త దిశ



- 36 ప్రాజెక్టులకు స్పష్టమైన గడువులు
- రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని మొత్తం 36 ప్రాజెక్టులకు స్పష్టమైన గడువు పెట్టుకుని పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో పూర్తి చేయాలనే లక్ష్యాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నిర్దేశించడం జరిగిందని రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి నిమ్మల రామానాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన ఇరిగేషన్ ప్రాజక్టులపై సమగ్ర సమీక్ష జరిగిందని, ఇందులో 25 పాత ప్రాజెక్టులతో పాటు 11 కొత్త ప్రాజెక్టులను గుర్తించి ప్రాధాన్యతా క్రమంగా పూర్తి చేయాలనే లక్ష్యాన్ని నీటిపారుటల శాఖకు నిర్ధేశించడం జరిగిందన్నారు. ప్రతి ప్రాజెక్టుకు శంకుస్థాపన, పురోగతి, పూర్తి గడువులు ఖచ్చితంగా నిర్దేశించబడటం జరిగిందన్నారు.

**2026--2028 కాలానికి 36 ప్రాజెక్టుల సమగ్ర కార్యాచరణ ప్రణాళిక :** గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన 25 ప్రాజెక్టులతో పాటు, సీఎం గుర్తించిన మరో 11 ప్రాజెక్టులను కలిపి మొత్తం 36 ప్రాజెక్టులకు స్పష్టమైన ప్రాధాన్యతా క్రమం, దశలవారీ గడువులు, అమలు ప్రణాళిక రూపొందించబడిందన్నారు. 2026 జూలై నాటికి పోలవరం-వీజ ద్వారా ఉత్తరాంధ్రకు నీటి సరఫరా, గుంటూరు ఛానల్ మోడరేషన్ పనుల శంకుస్థాపన, తుంగభద్ర కొత్త 33 గేట్ల ప్రారంభం వంటి కీలక పనులు అమలులోకి వస్తాయన్నారు. 2026 ఆగస్టు నాటికి వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-1 పూర్తి, అనంతపురం జిల్లాలో పేరూరు బ్రాంచ్ కెనాల్ శంకుస్థాపన, పాలేరు రిజర్వాయర్ పనులు ప్రారంభం కానున్నాయన్నారు. 2026 అక్టోబర్ నాటికి హంద్రీ-నీవా ఫేజ్-2 పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు.

మిగతా 3లో...

## నేడు 'మత్స్యకార చేయూత' ప్రారంభం..



- మత్స్యకార కుటుంబాల్లో 'కూటమి' వెలుగులు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.20 వేలుజమ చేయనున్న ప్రభుత్వం
- రాష్ట్రవ్యాప్తంగా 1.30 లక్షల కుటుంబాలకు రూ.262 కోట్లు లబ్ధి

**శ్రీకాకుళం (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని మత్స్యకార కుటుంబాల్లో సోమవారం పండగ వాతావరణం నెలకొంది. ఎన్నికల హామీలను అక్షరాలా అమలు చేస్తూ అడుగులు వేస్తున్న కూటమి ప్రభుత్వం.. మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేసింది. సముద్ర చేపల వేట నిషేధ కాలంలో (ఏప్రిల్ 15 నుండి జూన్ 14 వరకు) మత్స్యకారులకు ఆర్థిక వెన్నుదన్నుగా నిలిచేందుకు 'మత్స్యకార చేయూత' పథకానికి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వ ప్రభుత్వంలో కేవలం రూ.10 వేలు మాత్రమే ఇవ్వగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ మొత్తాన్ని రెట్టింపు చేసి ఒక్కో కుటుంబానికి రూ.20,000ల చొప్పున ఆర్థిక సహాయాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తోంది. రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సారథ్యంలో జిల్లాలోని మత్స్యకార వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. నెల్లూరు జిల్లా కావలిలో ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం జరిగే కార్యక్రమంలో ఈ పంపిణీ చేయనున్నారు.

మిగతా 3లో...

## ఏపీలో క్లీన్ ఎనర్జీ హబ్



- న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో ఏపీని నమ్మకమైన భాగస్వామిగా నిలుపుతాం!
- న్యూక్లియర్ ఎనర్జీ గ్లోబల్ భాగస్వాములతో కలిసి పనిచేసేందుకు సిద్ధం
- రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు మా లక్ష్యం
- డేటా సెంటర్ల చుట్టూ తయారీ ఎకోసిస్టమ్ ను అభివృద్ధి చేస్తాం
- యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టూ ఇండియా సదస్సులో మంత్రి లోకేష్

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ న్యూక్లియర్ ఆర్థికవ్యవస్థలో నమ్మకమైన గ్లోబల్ భాగస్వామిగా నిలబెట్టడం మా ధ్యేయం, ప్రపంచ న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్తదశలోకి ప్రవేశిస్తున్ననేపథ్యంలో ఇది కీలకంగా మారగలదని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. న్యూక్లియర్ ఎనర్జీ ఇనిస్టిట్యూట్, యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం సంయుక్తంగా యూఎస్ ఎగ్జిక్యూటివ్ న్యూక్లియర్ మిషన్ టు ఇండియా పేరిట యూఎస్ న్యూక్లియర్ ప్రతినిధులతో ఢిల్లీలో నిర్వహించిన సదస్సుకు మంత్రి నారా లోకేష్ అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి యూఎస్ - ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం మేనేజింగ్ డైరెక్టర్ నివేదిత మెహ్రా స్వాగతం పలుకగా, న్యూక్లియర్ ఎనర్జీ ఇన్ స్టిట్యూట్ ప్రెసిడెంట్ & సీఈవో మారియా కోర్స్నిక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ...

మిగతా 3లో...

## సమన్వయంతోనే సాధ్యం



- డిసెంబర్ నాటికి జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు పూర్తి చేయాలి
- మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్థన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

మిగతా 2లో...

## పీహెచ్‌సీల పనితీరు భేష్



- మంత్రి సత్యకుమార్ ప్రత్యేక శ్రద్ధతో మెరుగవుతున్న పీహెచ్సీల సేవలు
- గడిచిన 6 నెలల్లో 107 నుంచి 312కు పెరిగిన 'ఎ' శ్రేణి ఆరోగ్య కేంద్రాలు
- 'బి' శ్రేణిలో 354 నుంచి 455 కు చేరిన పీహెచ్సీలు
- మొత్తం 306 కేంద్రాల పనితీరు మరింత మెరుగు
- సి,డి,ఇ కేటగిరి కేంద్రాలూ తగ్గుదల
- వైద్య ఆరోగ్య శాఖ స్వీయ సమీక్షతో సత్ఫలితాలు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామీణులకు చేరువులో ఉశీడే ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉత్తమ పనితీరును కనబరుస్తున్నాయి. ఓపీ, ఐపీ, ల్యాబ్ టెస్టులు, ప్రసవాలు, ఇతర విధానాల అమల్లో పీహెచ్సీలు ముందంజలో ఉంటున్నాయి.

గత మార్చి (2026) నెలలో 1,144కు 312 పీహెచ్సి ఆసుపత్రులు 'ఎ' శ్రేణిలో వచ్చాయి. గతేడాది అక్టోబరు (2025) నెలలో 107 పీహెచ్సీలు మాత్రమే 'ఎ' శ్రేణిలో ఉన్నాయి. కేవలం ఆరు నెలల్లో మూడు రెట్లు ఎక్కువగా పీహెచ్సీలు (312) 'ఎ' శ్రేణికి చేరుకోవడం గమనార్హం. ఇదే కాల వ్యవధిలో బి శ్రేణి ఆసుపత్రులు 354 నుంచి 455(అదనంగా 101)కు చేరుకున్నాయి.

మిగతా 2లో...

## బుల్లెట్ వేగంతో 'బుల్లెట్' ప్రాజెక్టు!



- సీఎం చంద్రబాబుతో రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థ ప్రతినిధుల భేటీ
- బుల్లెట్ వాహన మోడళ్లను పరిశీలించిన సీఎం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** బుల్లెట్ వేగంతో రాష్ట్రంలో బుల్లెట్ మోటార్ సైకిల్ ప్రాజెక్టు ఏర్పాటు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి సమీపంలో ఏర్పాటు చేయనున్న రాయల్ ఎన్ ఫీల్డ్ ప్రాజెక్టును 18 నెలల్లో నిర్మాణం పూర్తి చేసి ఉత్పత్తి ప్రారంభించాలని దీనికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సహకారాన్ని అందిస్తుందని సీఎం వెల్లడించారు. రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థ సీఈఓ గోవింద రాజన్ సోమవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. బుల్లెట్ మోటార్ సైకిల్ తయారీ యూనిట్ కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రోత్సాహకాలను కల్పించటంపై ఆ సంస్థ ప్రతినిధులు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాళ్లకుప్పం, వానల్లూరు గ్రామాల వద్ద రూ.2500 కోట్ల పెట్టుబడితో బుల్లెట్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అత్యాధునిక తయారీ యూనిట్‌తో పాటు టెస్టింగ్ ట్రాక్, పరిశోధనా కేంద్రం, వెండార్ పార్క్ ఎకోసిస్టమ్ కూడా నిర్మిస్తామని అన్నారు. ఈ ప్లాంట్ ద్వారా ఏడాదికి 9 లక్షల మోటార్ సైకిళ్లు ఉత్పత్తి చేయనున్నట్టు రాయల్ ఎన్ ఫీల్డ్ సీఈఓ గోవిందరాజన్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 15 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.

మిగతా 2లో...

## "విద్య"తోనే పేదరిక నిర్మూలన



- పేద మైనారిటీ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి ఇంటర్ విద్య
- ప్రతిభావంతులను గుర్తించేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష సక్సెస్
- రాష్ట్రవ్యాప్తంగా 6605 మంది హాజరు
- మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి
- నిర్వహణ అధికారులకు మంత్రి అభినందన

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** విద్యతోనే యువత తాము అనుకున్న ఉన్నత స్థాయి లకు ఎదగగలుగుతారని, తద్వారా సమాజాభివృద్ధిలో తమ వంతు భాగస్వామ్యం కావాలని, విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

మిగతా 3లో...

## పెండింగ్ వ్యవసాయ కనెక్షన్లు తక్షణమే మంజూరు చేయండి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న అన్ని వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను తక్షణం మంజూరు చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని మూడు విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు లోతేటి శివ శంకర్, పృథ్వీ తేజ్ ఇమ్మడి, పి.పుల్లారెడ్డిలతో సోమవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ.. వేసవిలో గృహ, వ్యాపార, పారిశ్రామిక వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

మిగతా 3లో...

# పీహెచ్‌సీల పనితీరు భేష్

(మొదటి పేజీ తరువాయి)



సి, డి, ఇ గ్రేడుల ఆసుపత్రులు తగ్గుతూ వచ్చాయి.

హెల్త్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్ఎంఐఎస్) లో నమోదుచేసే వివరాల ప్రకారం పీహెచ్సీల పనితీరును శ్రేణుల వారీగా గుర్తించి, సదరు నివేదికను డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ పద్మావతి రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ కు అందచేశారు. గతేడాది అక్టోబరు నుంచి ఈ ఏడాది మార్చి వరకు నెలల వారీగా 1,144 పీహెచ్సీల పనితీరు మదింపు వివరాలను డీహెచ్ తన నివేదికలో పొందుపరిచారు. 'బి' గ్రేడ్ కేంద్రాలు కిందటేడాది అక్టోబరులో 354 ఉండగా మార్చి నాటికి 455 చేరుకున్నాయి. సి గ్రేడులో 298, డి గ్రేడులో 72, 'ఇ' గ్రేడులో 7 చొప్పున ఆసుపత్రులు ఉన్నాయి:

**పనితీరు ప్రతిపాదికన మార్కుల కేటాయింపు :** రాష్ట్ర వ్యాప్తంగా 1,144 పీహెచ్సీలు ఉన్నాయి. ఓపీకి 1, ఐపీ-1, ల్యాబ్ టెస్టు-1, ప్రసవాలు-1, ఇతర ఒకటి చొప్పున కలిపి ఐదు మార్కులు ఇస్తున్నారు. పీహెచ్సీల ద్వారా రోగులకు అందచేసే సేవల వివరాలు హెచ్ఎంఐఎస్ ఎప్పటికప్పుడు నమోదవుతున్నాయి. నెలకు 1,500 ఓపీ, 100 ఐపీ (డే-కేర్), ల్యాబ్ టెస్టులు-3,000, పది చొప్పున ప్రసవాలు జరగాలి. ఇంకొన్ని ఫలితాలను శాస్త్రీయ కోణంలో విశ్లేషించి, పనితీరు ప్రతిపాదికన పీహెచ్సీలకు వైద్య ఆరోగ్య శాఖ 'శ్రేణులు' ఇస్తోంది. సమీక్షా సమావేశాల్లో తక్కువ పనితీరు కనబరిచే ఆసుపత్రులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి శ్రీ సత్య కుమార్ సమీక్ష సమావేశాల ద్వారా ఉన్నతాధికారులను ఆదేశిస్తున్నారు. వీటికి అనుగుణంగా జిల్లాలకు వెళ్లే ఆదేశాలనుసారశీ అక్కడి అధికారులు పీహెచ్ సీల వైద్యులతో సమీక్షలు జరుపుతూ వైద్య సేవలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీనివల్ల పీహెచ్ సీ ల పనితీరు క్రమంగా మెరుగుపడుతో శీది. దీనివల్ల సి, డి, ఇ గ్రేడ్లలో ఉన్న పీహెచ్సీలు తగ్గుతున్నాయి

**ఆరుసార్లు 'ఎ' శ్రేణిని దక్కించుకున్న పీహెచ్సీలు :** అన్నమయ్య జిల్లాలో కురబలకోట పీహెచ్సీ అక్టోబరు నుంచి మార్చి వరకు ప్రతినెలా 'ఎ' శ్రేణిలో వచ్చింది. ఈస్టుగోదావరి జిల్లాలో బ్రహ్మణగూడెం, చాగల్లు, నల్లజర్ల పీహెచ్సీలు వరుసగా ఆరుసార్లు ప్రథమ శ్రేణిలో వచ్చాయి. కాకినాడ జిల్లాలో తేటగుంట పీహెచ్సీ ఆరుసార్లు, ఇలా ప్రతి జిల్లాలో కొన్ని పీహెచ్సీలు ఐదు నుంచి మూడుసార్లు చొప్పున 'ఎ' శ్రేణిలో వచ్చాయి.

**మార్చి వరకు చూస్తే :** ఈ ఏడాది మార్చి నెల శ్రేణులు పరిశీలిస్తే వెస్టు గోదావరిలో 34కు 33, కృష్ణా జిల్లాలో 49కు 42, వైఎస్సార్ కడప-57కు 42, విజయనగరం జిల్లాలో 48కు 32 పీహెచ్సీలు ప్రథమ శ్రేణిలో వచ్చాయి. పోలవరం జిల్లాలో 28 పీహెచ్సీలకు 2, మార్కాపురం జిల్లాలో 38కు 1, శ్రీకాకుళం జిల్లాలో 66కు ఒకటి, నెల్లూరు జిల్లాలో 52కు ఒకటి, చిత్తూరు జిల్లాలో 42కు ఒక పీహెచ్సీ 'ఈ' గ్రేడులో ఉన్నాయి.

**చిత్తూరు జిల్లాలో అత్యధికంగా 'డి' శ్రేణి ఆసుపత్రులు :** గత మార్చి నెలకు సంబంధించి డి గ్రేడ్ పీహెచ్సీలు రాష్ట్రవ్యాప్తంగా 72 ఉన్నాయి. ఇందులో అత్యధికంగా 10 చిత్తూరు జిల్లాలోనే ఉన్నాయి. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాలో తొమ్మిది, పోలవరం జిల్లాలో 8, మన్యం జిల్లా, శ్రీకాకుళం జిల్లాలో ఏడు చొప్పున, ఏలూరు జిల్లాలో ఆరు చొప్పున డి గ్రేడ్ ఆసుపత్రులు ఉన్నాయి. గత మార్చి నెలలో 'ఇ' గ్రేడ్ ఆసుపత్రులు ఏడు ఉంటే.. రెండు పోలవరం జిల్లాలో ఉన్నాయి. నెల్లూరు చిత్తూరు, మార్కాపురం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలో ఒక్కొక్క పీహెచ్సీ ఉంది.

# బుల్లెట్ వేగంతో 'బుల్లెట్' ప్రాజెక్టు!



(మొదటి పేజీ తరువాయి)

త్వరలో ఫ్లైయింగ్ ఫ్లీ సీ6 పేరిట ఎలక్ట్రిక్ వేరియంట్ మోడల్‌ను కూడా తీసుకురానున్నట్టు ఆ సంస్థ ప్రతినిధులు సీఎంకు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం ఆంధ్రప్రదేశ్ లో రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పాదనకు సంబంధించి చేపట్టిన వివిధ ప్రాజెక్టులపై రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ప్రతినిధులకు వివరించారు. సౌర, పవన విద్యుత్ తో పాటు పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్స్ ప్రాజెక్టుల గురించి వారికి తెలియచేశారు. అనంతరం రాయల్ ఎన్ ఫీల్డ్ ప్రతినిధులు సీఎంకు బుల్లెట్ 350 మినియేచర్ మోడల్‌ను ముఖ్యమంత్రికి అందించారు. ఈ సందర్భంగా బుల్లెట్ 350 మోటార్ సైకిళ్లకు సంబంధించిన మోడళ్లను సీఎం పరిశీలించారు. హెల్మెట్ ధరించి సీఎం బుల్లెట్ ఎక్కారు.

# సాగునీటి రంగానికి అగ్రతాంబూలం!

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీ నాటికి డయాఫ్రాం వాల్ నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులు 2027 మార్చి 31 నాటికి పూర్తి అవుతాయని ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. పోలవరం కుడి కాలువను అనుసంధానించే ట్విన్ టన్నెల్స్ పనులు 85 శాతం పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. ఎడమ కాలువ అప్రోచ్ ఛానల్, హెడ్ రెగ్యులేటర్, ఇరిగేషన్ టన్నెల్ పనులను చేపడుతున్నట్టు వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు.. వివిధ ప్రాజెక్టుల పురోగతిని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. హంద్రీనీవా ఫేజ్ 1 లో భాగంగా కాలువల వెడల్పు 92 శాతం పూర్తి అయ్యిందని అధికారులు చెప్పారు. ఫేజ్ 2 కుప్పం-పుంగనూరు కాలువల లైనింగ్ 85 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. మల్యాల లిఫ్ట్ నుంచి రాయలసీమ ప్రాంతానికి తొలిసారిగా 52 టీఎంసీల నీటిని తరలించామని చెప్పారు. మొత్తంగా 432 చెరువులు పూర్తిగా నింపామని వెల్లడించారు. జూన్ 2024 నుంచి ఇప్పటి వరకూ రూ.2123 కోట్లు వ్యయం చేశామని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ప్రతీ నెలా పోలవరం పనుల పురోగతిపై సమీక్షిస్తాను. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-1,2 పనులు చెప్పిన సమయానికి పూర్తి చేయాల్సిందే. ఈ ఏడాది జూలై నెల నుంచి పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఎడమ కాలువ నుంచి నీరు అందివ్వాలి. ఎడమకాలువ నీరు మేఘాద్రిగడ్డకు పోలవరం జలాలు తీసుకువెళ్లాక అక్కడి నుంచి వంశధార-నాగావళి-చంపావతి వరకూ నీరు వెళ్లేలా చూడాలి. మేఘాద్రి గడ్డ నుంచి చంపావతి లింక్ కు ఎంత వ్యయం అవుతుందో అధ్యయనం చేయాలి. పోలవరం ఆర్ అండ్ ఆర్ ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం అందించే విషయంలో చట్టప్రకారం ముందుకు వెళ్లాలి. 2027 ఏప్రిల్ నాటికి నిర్వాసితుల తరలింపును పూర్తి చేయాలి. ఎలాంటి వివాదాలు లేకుండా ఆర్ అండ్ ఆర్ వేగంగా పూర్తి కావాలి. పోలవరం స్పిల్ వే దిగువన ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. బెస్ట్ టూరిజం ప్రాంతంగా పోలవరం ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం కావాలి."అని సీఎం సూచించారు.

**వెలిగొండకు హై ప్రయార్టీ :** "వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ జూలై నాటికి పూర్తి కావాలి. హెడ్ వర్క్స్, కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, భూసేకరణ లాంటి పనుల కోసం ఇంకా రూ. 2019 కోట్లు అవసరం. టీబీఎంను తొలగించి అడ్డంకులు లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్ బ్యాలెన్సు పనులు వేగంగా పూర్తి కావాలి. అడవిపల్లి, శ్రీనివాసపురం నుంచి నీవా కాలువ ద్వారా చిత్తూరుకు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి. హంద్రీ నుంచి నీవా వరకూ నీళ్లు తీసుకెళ్లేలా ప్రాధాన్యతగా తీసుకుని పనులు పూర్తి కావాలి. నీళ్లు చూస్తే ప్రజల్లో ఓ నమ్మకం వస్తుంది. మైదుకూరు, మడకశిర లాంటి చివరి ప్రాంతాలకు నీళ్లు వెళ్లాలి. నీవాకు ఈ ఏడాది నీరు ఇచ్చేలా లక్ష్యం పెట్టుకోవాలి. కల్యాణి డ్యామ్ నీవా బ్రాంచ్ కెనాల్ ద్వారా మూలపల్లి చెరువుకు నీరు ఇచ్చేలా చర్యలు చేపట్టాలి. చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్టు కాలువ పనులు వచ్చే ఏడాది జూలై నాటికి పూర్తి కావాలి. వరికెపుడిశెలను కూడా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి. ప్రతీ ప్రాజెక్టుకు సంబంధించిన ఇంపాక్ట్ స్టడీ చేయాలి. అంతరాష్ట్ర సమస్యలు లేకుండా ప్రాజెక్టులు పూర్తి చేసుకుందాం. నల్లమల సాగర్ ప్రాజెక్టు విషయమై కేంద్రంతో మాట్లాడదాం. గోదావరి-కావేరి అనుసంధానం పైనా కేంద్రంతో సంప్రదింపులు జరుపుదాం."అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

**ఖరీఫ్ కు నీరిచ్చే అంశంపై జలవనరుల శాఖకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం :** "ఎల్ నినో లాంటి పరిస్థితుల నేపథ్యంలో ముందస్తు అంచనాలను సిద్ధం చేసుకుంటూ పంటలు వేసేలా రైతులను సమాయత్తం చేయాలి. నెల్లూరు సాగు తీరును మార్చేలా చర్యలు తీసుకోవాలి. ఈసారి రెయిన్ ఫాల్ మైనస్ 3 శాతంగా ఉంది. భూగర్భ నీటి నిల్వలు 9.49 మీటర్లుగా ఉన్నాయి..గతేడాదితో పోలిస్తే 0.5 మీటర్లు ఎక్కువ ఉంది. ప్రస్తుత నీటి వనరుల్ని నింపేలా స్ట్రక్చర్ల నిర్మాణం జరగాలి. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు చేసుకుంటూ ముందుకు వెళ్లాలి. సాగునీటి సంఘాలతో పాటు ప్రజల భాగస్వామ్యం ఉండాలి. నీటి భద్రత అత్యంత కీలకమనే అంశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి. కృష్ణా డెల్టాలో గతంలో ఆలస్యంగా సాగు సీజన్ ఉండేది. తుపాన్లు ప్రభావం వల్ల పంటనష్టానికి పరిహారం ఇవ్వాల్సి వచ్చేది. పట్టిసీమ ద్వారా గతంలో నీరిచ్చాం. ఈసారి సీజన్ ను ముందుకు తీసుకువచ్చేలా నిర్ణయాలు తీసుకున్నాం. వాటర్ మేనేజ్మెంట్ లో ఇది కీలకమైన అంశం. మైక్రో ఇరిగేషన్ రంగంలో ఏపీ అగ్రస్థానంలో ఉంది. నీటి భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. జలధార-జలహారతి కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలి. ప్రస్తుతం వ్యవసాయం కోసం సుమారు రూ. 17 వేల కోట్ల మేర విద్యుత్ ఖర్చులను భరిస్తున్నాం. భూగర్భ జలాలు పెరిగితే విద్యుత్ వినియోగం తగ్గుతుంది. అప్పుడు ప్రభుత్వంపై విద్యుత్ భారం కూడా తగ్గుతోంది. అందుకే నీటి భద్రతకు ప్రాధాన్యమిస్తున్నాం."అని ముఖ్యమంత్రి వెల్లడించారు.



**గత పాలకుల నిర్వాకం వల్ల నిర్వీర్యమైన లిఫ్ట్ స్కీంలు :** ఇరిగేషన్ రివ్యూలో భాగంగా లిఫ్ట్ స్కీంల పనితీరు మీద ముఖ్యమంత్రి సమీక్షించారు. 2014-19 మధ్య కాలంలో నాటి ప్రభుత్వం లిఫ్ట్ స్కీంలకు అవసరమైన కేటాయింపులు జరిపేదని...అలాగే మరమ్మత్తులకు తగినన్ని నిధులు వెచ్చించే వాళ్లని అధికారులు తెలిపారు. అయితే 2019-24 మధ్య కాలంలో లిఫ్ట్ స్కీంలకు ఎలాంటి బడ్జెట్ కేటాయింపులు జరపలేదని అధికారులు సీఎంకు వివరించారు. దీని వల్ల సుమారు 362 లిఫ్ట్ స్కీంలు నిర్వీర్యం అయ్యాయని అధికారులు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. లిఫ్ట్ స్కీంలను పునరుద్దరించే అంశంపై చర్యలు చేపట్టిందని చెప్పారు. ప్రస్తుతం 156 లిఫ్ట్ స్కీంలు సంపూర్ణంగా... 505 స్కీంలు పాక్షికంగా పని చేస్తున్నాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. లిఫ్ట్ స్కీంలను గాడిలో పెట్టేలా పని చేయాలని సీఎం సూచించారు. గతంలో సుమారు 10 లక్షల ఎకరాలకు లిఫ్ట్ స్కీంల ద్వారా సాగునీటిని అందించే పరిస్థితి ఉండేదని సీఎం గుర్తు చేశారు. అలాంటి వ్యవస్థలు నిర్వీర్యం కాకూడదని... వీటిని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటే రైతులకు మరింత మేలు జరుగుతుందని సీఎం అన్నారు. ఈ సమీక్ష సమావేశానికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎస్ సాయి ప్రసాద్, జలవనరులు, ఆర్ధిక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

**సమీక్షలో ప్రకటించిన ఇరిగేషన్ క్యాలెండర్ వివరాలు... :**

1. కాటన్ బ్యారేజ్ గేట్స్ (ఫౌండేషన్) – జూన్ 2026
2. పోలవరం ఎడమ ప్రధాన కాలువ – జూలై 2026
3. గుంటూరు ఛానల్ ఆధునీకరణ (ఫౌండేషన్) – జూలై 2026
4. వెలిగొండ ఫేజ్ – 1 – ఆగస్టు 2026
5. తుంగభద్ర కొత్త గేట్లు – జూన్/జూలై 2026
6. హంద్రీ నీవా బ్రాంచ్ (ఫౌండేషన్) – ఆగస్టు 2026
7. గాలేరు నగరి (ఫౌండేషన్) – ఆగస్టు 2026
8. నేరడి బ్యారేజ్ (ఫౌండేషన్) – నవంబర్ 2026
9. మద్దువలస ఫేజ్-2 – జనవరి 2027
10. హీర మండలం ఎత్తిపోతల పథకం – ఏప్రిల్ 2027
11. నాగావళి – చంపావతి నదుల లింక్– జూన్ 2027
12. పోలవరం ప్రాజెక్ట్ – జూన్ 2027
13. బుడమేరు ఫ్లడ్ ప్రొటెక్షన్ (అండర్ టన్నెల్, డ్రైనేజ్ ఛానల్, కొల్లేరు వరకు) – జూన్ 2027
14. ముక్త్యాల ఎత్తిపోతల పథకం – జూన్ 2027
15. వంశధార ఫేజ్-2 స్టేజ్-2 (హిర మండలం బ్యారేజ్) – జూలై 2027
16. చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్ 1 – జూన్ / జూలై 2027
17. హంద్రీ-నీవా ఫేజ్-2(నీవా బ్రాంచ్ కెనాల్ వరకు) – – అక్టోబర్ 2026
18. తోటపల్లి డిస్ట్రిబ్యూటరీ – జూలై 2027
19. నీవా బ్రాంచ్ కెనాల్ (మూలపల్లి వరకు) -- జనవరి 2027
20. మూలపల్లి లిఫ్ట్ – డిసెంబర్ 2027
21. మడకశిర బ్రాంచ్ కెనాల్ వైడెనింగ్ – డిసెంబర్ 2027
22. ఝంఝావతి రిజర్వాయర్ – డిసెంబర్ 2027
23. వేదవతి ఎత్తిపోతల పథకం – జూన్ 2028
24. భైరవాని తిప్ప – జూన్ 2028
25. అప్పర్ పెన్నార్ ప్రాజెక్ట్ – జూన్ 2028
26. జీఎన్ఎస్ఎస్ కెనాల్(కడప వరకు) – జూన్ 2028
27. సోమశిల-స్వర్ణముఖి లింక్ – జూన్ 2028
28. శ్రీశైలం రైట్ మెయిన్ కెనాల్ వైడెనింగ్ – డిసెంబర్ 2028
29. తారక రామతీర్థ సాగర్ – డిసెంబర్ 2027
30. మహేంద్ర తనయ – జూలై 2027
31. గజపతినగరం బ్రాంచ్ కెనాల్ – జూలై 2027
32. గాలేరు-నగరి(కడప, కోడూరు వరకు) – డిసెంబర్ 2028
33. కోడూరు-బాలాజీ సాగర్ – డిసెంబర్ 2028
34. గోదావరి డెల్టా మోడ్రనైజేషన్ – జూన్ 2028
35. పెన్నా-సర్వేపల్లి – డిసెంబర్ 2026
36. వరికిపూడిసెల – డిసెంబర్ 2028

# వేటకు విరామం... సర్కారు సాయం

- **గంగపుత్రులకు రెండో ఏడాది అండగా ప్రజాప్రభుత్వం**
- **'మత్స్యకారుల సేవలో' కింద ప్రతీ కుటుంబానికి రూ.20 వేలు జమ**
- **1.30 లక్షల కుటుంబాలకు రూ.262 కోట్లు లబ్ధి**
- **కావలిలో నేడు నిధులు విడుదల కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లోని మత్స్యకారుల కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. వేట నిషేధ కాలంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా మత్స్యకారులను ఆదుకునేందుకు అమలు చేస్తోన్న 'మత్స్యకారుల సేవలో' పథకం కింద వరుసగా రెండో ఏడాది ఆర్థిక సాయం అందించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 1,30,796 మత్స్యకార కుటుంబాలకు రూ. 262 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం మత్స్యకారుల ఖాతాల్లో జమ చేయనుంది. నెల్లూరు జిల్లా కావలి మండలం తుమ్మలపెంట గ్రామంలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులు విడుదల చేయనున్నారు. ప్రతీ ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు... 61 రోజుల పాటు సముద్రంలో చేపలు పిల్లలు పెట్టే సమయంలో వేటకు విరామం ఉంటుంది. ఈ సమయంలో మత్స్యకారుల జీవనానికి ఇబ్బంది లేకుండా చేసేందుకు ప్రభుత్వం ప్రతీ కుటుంబానికి రూ. 20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తోంది.

**రెండేళ్లలోనే రూ.505 కోట్ల సాయం :** వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ. 20 వేలు ఆర్థికసాయం ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చింది. హామీ ఇచ్చినట్టుగానే గతేడాది 1,21,433 కుటుంబాలకు రూ. 243 కోట్లు సాయం అందించగా... ఈ ఏడాది 1,30,796 మత్స్యకార కుటుంబాలకు రూ. 262 కోట్ల ఆర్థిక సాయాన్ని ఇస్తోంది. ఈ ఏడాది లబ్ధిదారు కుటుంబాల సంఖ్య కూడా పెరిగింది. రెండేళ్లలోనే మత్స్యకారుల కుటుంబాలకు వేట నిషేధ సమయంలో రూ. 505 కోట్లను సాయంగా అందించింది. గత ప్రభుత్వం మత్స్యకారులకు కేవలం రూ. 10 వేల సాయాన్ని మాత్రమే అందించింది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో కూడుకున్నప్పటికీ బలహీన వర్గాల సంక్షేమానికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ సాయాన్ని రూ. 20,000 పెంచుతూ ప్రజా ప్రభుత్వం బాసటగా నిలిచింది. వరుసగా రెండో ఏడాది ఇవ్వడంతో పాటు లబ్ధిదారుల సంఖ్యను పెంచి నిధులు విడుదల చేయడం ద్వారా మత్స్యకారుల సంక్షేమంపై ప్రభుత్వ చిత్తశుద్ధి స్పష్టమవుతోంది.

**సకాలంలో పరిహారం... కుటుంబాలకు సహకారం:** వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వేట సమయంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు పరిహారం సకాలంలోనే అందిస్తోంది. 2024-25లో 63 క్లెయిమ్స్‌కు రూ. 3.15 కోట్లు, 2025-26లో 113 పెండింగ్ క్లెయిమ్స్‌కు రూ. 5.65 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. అంతేకాకుండా వారి ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం సీవీడ్ సాగును ప్రోత్సహిస్తోంది.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మత్స్యకారుల సేవలో కార్యక్రమంలో భాగంగా నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 09.30 గంటలకు అమరావతి క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి 10.30 గంటలకు కావలి మండలం తుమ్మలపెంటకు చేరుకుంటారు. 10.45 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. నిధులు విడుదల చేస్తారు. మధ్యాహ్నం 01.15 గంటలకు గ్రామంలోని మత్స్యకార కుటుంబాలతో భేటీ అవుతారు. 2 గంటలకు టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 04.45 గంటలకు తిరిగి అమరావతికి చేరుకుంటారు.

# సమన్వయంతోనే సాధ్యం



(మొదటి పేజీ తరువాయి)

సోమవారం సచివాలయంలో నిర్వహించిన 4వ టాస్క్ ఫోర్స్ కమిటీ సమీక్షా సమావేశంలో ఆయన జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల పురోగతిని ఉన్నతాధికారులతో సమీక్షించారు. భూసేకరణ, అటవీ క్లియరెన్స్ వంటి పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుంటూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పేర్కొన్నారు.

జాతీయ రహదారుల ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పటివరకు 21 భూసేకరణ సమస్యల్లో 9 పూర్తిగా, మరో 12 పాక్షికంగా పరిష్కరించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. రాష్ట్రంలో 602 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణలో 397 కిలోమీటర్ల మేర పూర్తయిందని తెలిపారు. మిగిలిన భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను వేగంగా పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. అలాగే రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులను 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కోటిపల్లి-నర్సాపురం, నడికుడి-శ్రీకాళహస్తి, భద్రాచలం--కొవ్వూరు, కడప-బెంగళూరు రైల్వే మార్గాలకు సంబంధించిన కాస్ట్ షేరింగ్ అంశాలపై కేంద్ర రైల్వే శాఖతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అమరావతి పరిధిలోని నంబూరు--అమరావతి రైల్వే లైన్‌కు భూసేకరణ వేగవంతం చేయాలని, రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, రోడ్ అండర్ బ్రిడ్జిల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# 'స్త్రీ శక్తి' సూపర్ హిట్..

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆర్టీసీ అనేది ప్రజా రవాణ వ్యవస్థగానే కాదు... మహిళలకు, దివ్యాంగులకు ఆర్థికంగా అండగా నిలిచే వ్యవస్థగా కూటమి ప్రభుత్వం తీర్చిదిద్దింది. తొలి నుంచి ఆర్టీసీ అనేది ఓ ప్రజా రవాణ వ్యవస్థగానే ప్రభుత్వాలు భావించాయి. కానీ ఈ ప్రజా రవాణ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్పించే నిర్ణయాలు తీసుకోవచ్చు.. పేద, మధ్య తరగతి ప్రజలకు భరోసా కల్పించవచ్చు అని కూటమి ప్రభుత్వమే నిరూపించింది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 2025 ఆగస్టు 15 స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించింది. అప్పటి వరకు బస్ ఛార్జీలు పెంచిన ప్రభుత్వాలనే చూసిన ప్రజలకు... స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత ప్రయాణాన్ని పరిచయం చేసింది కూటమి ప్రభుత్వం. ఆ వర్గం.. ఈ వర్గం అని లేకుండా.. ఎలాంటి షరతులు.. నిబంధనలు లేకుండా అమలవుతున్న ఏకైక పథకంగా స్త్రీ శక్తి పథకమే. ఈ పథకం అమలు ద్వారా ఆర్టీసీకి సంక్షేమ చరిత్రలో ప్రత్యేక స్థానం కల్పించింది సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ప్రారంభించిన మిగిలిన పథకాలన్ని ఒక ఎత్తు... స్త్రీ శక్తి పథకం మరో ఎత్తు అనే అభిప్రాయం అందరిలోనూ వ్యక్తమవుతోంది.

**స్త్రీ శక్తి పథకంలో ఉన్న గొప్పదనమిదే... :** స్త్రీ శక్తి పథకంతో పేద, మధ్యతరగతి ప్రజల ఆదాయం ఆదా అవుతోంది. ఇది మహిళల్లో ఆర్థిక సాధికారత పెంచింది. ఓ మహిళా ఉద్యోగి ఆఫీసుకు వెళ్లాలన్నా.. ఓ యువతి కాలేజీకి వెళ్లాలన్నా.. మహిళా రైతు ఉత్పత్తులను మార్కెట్టుకు తీసుకెళ్లి అమ్ముకోవాలన్నా ఆర్టీసీ బస్సెక్కి ఉచితంగా తమ గమ్య స్థానాలకు చేరుతున్నారు. అంతే కాకుండా పుట్టింటికి వెళ్లాలన్నా.. బంధువుల ఇంటికి వెళ్లాలన్నా ఉచితంగా ప్రయాణిస్తున్నారు. అలాగే పండుగ దినాల్లో పుణ్యక్షేత్రాలకు పెద్ద ఎత్తున తరలి వెళ్తున్నారు. దీని వల్ల ప్రతి కుటుంబానికి సుమారుగా రూ. 2 వేల నుంచి 2,500 ఆదా అవుతున్నట్టు అంచనా. అంటే ఏడాదికి సుమారుగా రూ. 25 వేలు ఆదా అవుతోందని లబ్దిదారులే స్వయంగా చెబుతున్నారు. ఇక స్త్రీ శక్తి పథకం వల్ల దేవాలయాలకు ఆదాయం పెరుగుతోంది.. పర్యాటక ప్రాంతాల్లో రద్దీ పెరుగుతోంది. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో స్థానికంగా ఉపాధి మెరుగవుతోంది. అందుకే ఈ పథకం సూపర్ హిట్ అయింది. స్త్రీ శక్తి పథకం ప్రారంభించిన 9 నెలల్లో 67 కోట్ల ఉచిత ప్రయాణాలు జరిగితే.. సుమారు రూ. 2350 కోట్ల మేర సబ్సిడిని ప్రభుత్వం భరించింది. దీనికి గానూ.. రూ. 720 కోట్లను ప్రభుత్వం ఆర్టీసీకి రీ-ఇంబర్స్ చేసింది. ఈ విధంగా ఎప్పటికప్పుడు రీ-ఇంబర్స్ చేస్తూ ఆర్టీసీపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తోంది ప్రభుత్వం. ఈ పథకం ద్వారా ఆర్టీసీకి స్త్రీ శక్తి బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో సుమారుగా 92 శాతానికి పెరిగింది. గతంలో సుమారుగా 60 శాతంగా ఉండే ఆక్యుపెన్సీ రేషియో స్త్రీ శక్తి పుణ్యమా అని 92 శాతానికి చేరింది. ఇందులో పురుష ప్రయాణికుల సంఖ్య 40 శాతంగా ఉంది. ఈ పథకం ఓ విధంగా ఆర్టీసీకి అండగా నిలుస్తోంది. స్త్రీ శక్తి కింద వచ్చే సబ్సిడీని ప్రభుత్వం నుంచి అందుకుంటోంది.. అలాగే పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో ద్వారా ఆర్టీసీ తన ఆదాయాన్ని పెంచుకుంటోంది. ఇక దివ్యాంగ శక్తి కింద దివ్యాంగులు సుమారు 25 లక్షల ఉచిత ప్రయాణాలు జరిగాయి.



**ప్రాణాలు కాపాడుతున్న స్త్రీ శక్తి... :** ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం అనేది ఏపీఎస్ఆర్టీసీకి ఉన్న బ్రాండ్. ఈ బ్రాండ్ నిలబెట్టేలా స్త్రీ శక్తి పథకం ఆర్టీసీకి ఉపకరిస్తోంది. స్త్రీ శక్తి పథకం అమలు తర్వాత ఆర్టీసీలో ఆక్యుపెన్సీ రేషియో పెరిగింది. చాలా మంది మహిళలు ఆటోల్లో... ఇతర వాహనాల్లో ప్రయాణాలు తగ్గించుకుని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణాలు చేస్తున్నారు. దీంతో ప్రమాదాల బారిన పడి చనిపోయే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రకాశం జిల్లా ఎస్పీ నిర్వహించిన సర్వే ప్రకారం స్త్రీ శక్తి పథకం ప్రవేశపెట్టిన తర్వాత ప్రమాదాల్లో మహిళా మరణాల సంఖ్య దాదాపు 39 శాతం మేర తగ్గినట్టు వెల్లడైంది. అలాగే ప్రమాదాల్లో పురుషుల మరణాల సంఖ్య కూడా గణనీయంగా తగ్గినట్టు గుర్తించారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబుకు ప్రకాశం జిల్లా ఎస్పీ వివరించారు. దీనిపై రాష్ట్ర స్థాయి అధ్యయనం చేయించాల్సిందిగా ముఖ్యమంత్రి ఆదేశించారు.

**ఆర్టీసీని, ఉద్యోగులను ఆదుకునేలా ప్రభుత్వం చొరవ :** ఎన్నికలకు ముందు సిబ్బంది సమస్యలు, పెండింగ్ బకాయిలు, బస్సుల కొరత వంటి అనేక సవాళ్లను ఆర్టీసీ ఎదుర్కొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ పునర్వ్యవస్థీకరణకు ప్రాధాన్యత ఇచ్చింది. ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సేవల మెరుగుదల, ఆధునికీకరణ, ఆర్థిక బలోపేతం లక్ష్యంగా అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. డ్రైవర్లు, కండక్టర్లు ఎక్కువసేపు విధులు నిర్వహిస్తూ కుటుంబాలకు దూరంగా పనిచేయాల్సి వస్తుంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో సేవలు అందించే సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ అంశాన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రతి నైట్ డ్యూటీకి రూ. 150 చొప్పున నైట్ అవుట్ అలవెన్స్ మంజూరు చేసింది. ఈ నిర్ణయంతో ఉద్యోగులకు నెలకు రూ. 2 వేల నుంచి రూ. 5 వేల వం-కు అదనపు ఆదాయం లభిస్తోంది. ఇది వారి కుటుంబ ఆర్థిక పరిస్థితికి ఊరటనిస్తోంది. ప్రమోషన్ల విషయంలో ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉపశమనం కల్పించింది. 2020కు ముందు నియమితులై ప్రభుత్వ సేవల్లో విలీనమైన ఉద్యోగులకు పాత =ఱజ మార్గదర్శకాలను పునరుద్ధరించడంతో సుమారు 7 వేల మందికి పదోన్నతులు లభించాయి. ఈ నిర్ణయం ఉద్యోగుల కెరీర్ పురోగతికి దోహదపడుతోంది. అనేక మంది ఉద్యోగులు పదోన్నతుల ద్వారా అధిక వేతనాలు, బాధ్యతలు పొందే అవకాశం కలిగింది.

ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే్రూఱ ఉద్యోగులకు కూడా ూదీ×ూ+ఱ్రా పథకం వర్తింపజేయడం ద్వారా ప్రభుత్వం ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పించింది. రూ. 1 కోటి ప్రమాద భీమా, సహజ మరణానికి రూ. 10 లక్షల బీమా వంటి ప్రయోజనాలు ఉద్యోగ కుటుంబాలకు ఆర్థిక రక్షణగా నిలుస్తున్నాయి. జీరో బ్యాలెన్స్ ఖాతాలు, తక్కువ వడ్డీ రుణాలు, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు ఉద్యోగుల ఆర్థిక అవసరాలను సులభతరం చేస్తున్నాయి. ఇక విరమణ అనంతరం వైద్య ఖర్చులు భారం అవుతాయని భావించే ఉద్యోగులకు ప్రభుత్వం జీవితాంతం జుఱూ వైద్య సేవలు అందేలా నిర్ణయం తీసుకుంది. రిటైర్డ్ ఉద్యోగులు, వారి జీవిత భాగస్వాములకు ఈ సదుపాయం పెద్ద ఊరటనిచ్చింది. ఈ చర్య ప్రభుత్వం ఉద్యోగులను కేవలం సేవా కాలంలో మాత్రమే కాకుండా, జీవితాంతం ఆదుకుంటుందనే నమ్మకాన్ని కల్పించింది. విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు కల్పించడం ద్వారా ప్రభుత్వం మానవత్వాన్ని చాటుకుంది. ముఖ్యంగా అర్హతల విషయంలో సడలింపులు ఇవ్వడం వల్ల అనేక కుటుంబాలకు ఉపాధి అవకాశాలు లభించాయి.

**కొత్త బస్సులతో ఆధునిక ప్రయాణం :** 1,489 కొత్త బస్సులను ప్రవేశపెట్టడం ద్వారా ప్రభుత్వం ప్రజా రవాణా సేవలను ఆధునీకరించింది. సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, స్టార్ లైనర్, వెన్నెల వంటి బస్సులు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నాయి. ఈ కొత్త బస్సులు గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాల వరకు ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని కల్పిస్తున్నాయి. ఇక కేంద్ర ప్రభుత్వ సహకారంతో సుమారు 1450 ఈవీ బస్సులు త్వరలో రాబోతున్నాయి. ఇదే కాకుండా... బస్ స్టేషన్ల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 338 బస్ స్టేషన్ల అభివృద్ధికి ప్రభుత్వం రూ. 30 కోట్లు కేటాయించి ప్రజా రవాణా మౌలిక వసతులపై దృష్టి పెట్టింది.

# "విద్య"తోనే పేదరిక నిర్మూలన



(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ శాఖ వక్ఫ్ బోర్డు ద్వారా ఉచిత కార్పొరేట్ ఇంటర్ విద్య కోసం ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించేందుకు నిర్వహించిన లితాలీమ్ ఏ హునర్" ప్రవేశ పరీక్ష విజయవంతమైనట్లు సోమవారం అమరావతిలో విడుదల చేసిన ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 జిల్లాలలో 27 కేంద్రాలలో ప్రవేశ పరీక్షను ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నిర్వహించడం జరిగిందని వెల్లడించారు. కార్పొరేట్ కళాశాలలో ఉచిత ఇంటర్ రెసిడెన్షియల్ విద్య కోసం వక్ఫ్ బోర్డు ద్వారా అర్హులైన, ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 7392 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు.

అయితే ప్రవేశ పరీక్షకు 6605 మంది హాజరయ్యారని, 787 మంది హాజరు కాలేదని, 89.35% హాజరు నమోదైనట్లు మంత్రి తెలిపారు. ప్రవేశ పరీక్షకు హాజరైన వారిలో బాలికల శాతం ఎక్కువగా ఉన్నారన్నారు.

పేద ముస్లిం మైనారిటీ కుటుంబాలలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నత విద్య అభ్యసించేందుకు బలమైన పునాదులు వేయుటకు ఇంటర్మీడియేట్ విద్య అందించేందుకు కూటమి ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ద్వారా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందు కోసం "తాలీమ్ ఏ హునర్" పథకం ద్వారా విద్యార్థులను ఎంపిక చేసేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహణ కు శ్రీకారం చుట్టడం జరిగిందని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

ఈ పథకానికి మైనారిటీ వర్గాలతో పాటు అన్ని వైపుల నుండి ప్రభుత్వానికి, వక్ఫ్ బోర్డుకు, ముఖ్యమంత్రికి ప్రశంసల వెల్లువలు వచ్చాయన్నారు.

"తాలీమ్ ఏ హునర్ "పరీక్ష సజావుగా నిర్వహించినందుకు ఆయా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, మైనారిటీ శాఖ అధికారులు, సిబ్బందికి, ఇతర సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందికి, విస్తృత ప్రచారం కల్పించిన పాత్రికేయులకు మంత్రి ఫరూక్ ధన్యవాదాలు తెలిపారు.

# పెండింగ్ వ్యవసాయ కనెక్షన్లు తక్షణమే మంజూరు చేయండి



(మొదటి పేజీ తరువాయి)

వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సాంకేతిక సమస్యల కారణంగా ఎక్కడైనా విద్యుత్ అంతరాయం ఏర్పడితే తక్షణం ప్రజలకు సమాచారం అందించడంతో పాటు సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అధిక ఉష్ణోగ్రతల కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం వంటి ఘటనలు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నందున క్షేత్ర స్థాయిలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన సామగ్రి సంసిద్ధంగా ఉంచుకోవాలని మంత్రి సూచించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాధాన్య పథకాలైన సూర్యఘర్, పీఎం కుసుమ్, ఆర్డీఎస్ఎస్ కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా సూర్యఘర్ పథకం లో భాగంగా ఎస్సీ లబ్ధిదారుల లక్ష్యంగా పెట్టుకున్న 6 లక్షల కనెక్షన్లను జూలై నాటికి పూర్తి చేయడంతో పాటు ఇతర వర్గాలకు కూడా సోలార్ కనెక్షన్ల ను అందించే కార్యక్రమాన్ని వేగవంతం చేయడం ద్వారా ప్రభుత్వ లక్ష్యాన్ని త్వరగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని నమ్మకమైన విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఆకివీడు రామాలయం నిర్మాణంపై సుప్రీం కోర్టు స్టేటస్ కో.. ఏపీ ప్రభుత్వానికి నోటీసులు



**పశ్చిమగోదావరి జిల్లా (జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు రామాలయ నిర్మాణం రోజుకో మలుపు తిరుగుతోంది. ఆకివీడు రామాలయ నిర్మాణాన్ని సవాల్ చేస్తూ మొన్నటి వరకు హైకోర్టులో వరుసగా పిటిషన్లు దాఖలు కాగా.. తాజాగా సుప్రీంకోర్టులో దాఖలైంది. ఇవాళ విచారణ జరిపిన దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు ఇచ్చింది. సుప్రీం కోర్టు ఆకివీడు రామాలయ నిర్మాణంపై స్టేటస్–కో కొనసాగించాలని ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. పిటిషనర్ తరఫున జడ శ్రావణ్ కుమార్ వాదనలు వినిపించారు.

ఆకివీడు రామాలయం నిర్మాణ విషయంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిల్ దాఖలు చేసినప్పుడు ఇచ్చిన ఉత్తర్వుల్ని సుప్రీం కోర్టు ధర్మాసనం స్టే ఇచ్చిందని లాయర్ జడ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఆకివీడులో ఉన్న ప్రభుత్వం స్థలంలో ఎలాంటి మతపరమైన నిర్మాణాలు చేపట్టొద్దని కోర్టు ఆదేశించిందన్నారు. అధికారుల్ని, పోలీసుల్ని చెప్పుచేతల్లో పెట్టుకుని కొన్ని సంవత్సరాల నుంచి దళితులకు ఆరాధ్య దైవమైన గొంతెనమ్మ గుడిలో పూజలు చేస్తున్నవారి మనోభావాలు దెబ్బతీస్తూ అక్కడ రామాలయం ఉందని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. సుప్రీం కోర్టు తీర్పుతో వారందరి ప్రయత్నాలకు బ్రేకులు పడ్డాయన్నారు.

పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు పెద్దపేటలో రామాలయాన్ని నిర్మించాలని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు సంకల్పించారు. అయితే అక్కడ గొంతెనమ్మ ఆలయం ఉందని.. రామాలయం నిర్మాణాన్ని స్థానికులు కొందరు వ్యతిరేకిస్తున్నారు. రామాలయ నిర్మాణాన్ని సవాల్ చేస్తూ ఏపీ హైకోర్టులో పిటిషన్లు దాఖలు కాగా.. వాటిని కొట్టివేశారు. మే 3న ఆకివీడులో రామాలయ పునర్నిర్మాణానికి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు శంకుస్థాపన కూడా చేశారు. రామాలయం నిర్మాణం పూర్తి చేసి తీరుతామని.. కోర్టుకెళ్లినా, కేసులు వేసినా ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని చెప్పారు. రెండు వారాల క్రితం హైకోర్టులో దాఖలైన పిటిషన్లను కొట్టేయడంతో రామాలయం నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తాజాగా సుప్రీం కోర్టులో మరో పిటిషన్ దాఖలు కాగా.. అత్యున్నత న్యాయస్థానం స్టేటస్ కో విధించింది. దీంతో రామాలయం నిర్మాణానికి తాత్కాలికంగా బ్రేకులు పడ్డాయి.

# ఏపీలో క్లీన్ ఎనర్జీ హబ్




(మొదటి పేజీ తరువాయి)

స్మాల్ మాడ్యులర్ రియాక్టర్లు, తదుపరితరం రియాక్టర్ సిస్టమ్స్ వంటి ఆధునిక న్యూక్లియర్ సాంకేతికతలు, మాడ్యులర్ తయారీ, సప్లయ్ చైన్ పంపిణీ, స్కేలబుల్ వినియోగం నమూనాలకి విస్తృత అవకాశాలు ఉన్నాయి. భారత్ లో ఇంజనీరింగ్ ప్రతిభ, తయారీరంగంలో విస్తృతి, ఖర్చు విషయంలో పోటీతత్వం ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు పారిశ్రామిక ఇన్‌ఫ్రా, పోర్ట్స్, లాజిస్టిక్స్ కనెక్టివిటీ, అమలు సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఇది భారతదేశానికి, ఆంధ్రప్రదేశ్ కు ఒక చరిత్రాత్మక అవకాశాన్ని కల్పిస్తుంది.

**ఆంధ్రప్రదేశ్ లో సహజసిద్ధ ప్రయోజనాలు :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అనేక అదనపు ప్రయోజనాలు ఉన్నాయి. మాకు సువిశాలమైన తీరప్రాంతం, శక్తివంతమైన పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, విస్తతమైన పారిశ్రామిక కారిడార్లు, ప్రతిష్టాత్మకమైన పవర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉంది. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను అమలు చేస్తున్నాం. పారిశ్రామికీకరణలో వేగం, అమలు అత్యంత ముఖ్యం. ఇందులో న్యూక్లియర్ ఎకోసిస్టమ్ ప్రముఖ పాత్ర వహించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పర్యావరణ వ్యవస్థ ఆలోచనా విధానం ముఖ్యం. సాంకేతిక సహకారాలు, తయారీ భాగస్వామ్యాలు, సప్లై చైన్ అభివృద్ధి, ఇంజనీరింగ్ ఎకోసిస్టమ్స్, రీసెర్చ్ భాగస్వామ్యాలు, స్కిల్లింగ్, వర్క్‌ఫోర్స్ అభివృద్ధి, పారిశ్రామిక ప్రమాణాలు, భవిష్యత్ సాంకేతికల అమలుకు విశ్వసనీయ గ్లోబల్ భాగస్వాములతో పనిచేయడానికి మేం సిద్ధంగా ఉన్నాం.

**ఎనర్జీ సెక్యూరిటీ మాకు అత్యంత కీలకం :** ఈ సమావేశం ఒక అత్యంత ముఖ్యమైన సమయంలో జరుగుతోంది. ఇది కేవలం భారతదేశ ఎనర్జీ భవిష్యత్తుకే కాకుండా ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఎనర్జీ పరివర్తనకు సంబంధించినది అంశం కూడా. ఇప్పుడు ప్రపంచదేశాలు ఏకకాలంలో ఆర్థికవృద్ధి, పారిశ్రామిక వ్యాప్తి, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, డికార్బనైజేషన్ ఏవిధంగా సాధించాలనే అంశంపై ఆలోచన చేస్తున్నాయి. క్లైమేట్ కమిట్మెంట్లను పాటిస్తూ ఏఐ యుగాన్ని ఎలా ముందుకు నడిపించాలి, అందుకు అవసరమైన విద్యుత్ ను తక్కువ ఖర్చుతో ఎలా సిద్ధం చేసుకోవాలి, ఇంధన భద్రతను ఏవిధంగా సాధించాలనేది తక్షణ సవాళ్లుగా మారాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ఆకాంక్షలు విస్తృతంగా ఉన్న నేపథ్యంలో ఎనర్జీ సెక్యూరిటీ అన్నది మాకు అత్యంత ప్రాధాన్యతతో కూడిన అంశం. ఈరోజు ఆంధ్రప్రదేశ్ భారతదేశంలో అత్యంత కీలకమైన పారిశ్రామిక, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కేంద్రంగా మారింది.

**ఇంధన పరివర్తనపై ఆంధ్రప్రదేశ్ దృష్టి :** మేము కొత్త పారిశ్రామిక కారిడార్లను నిర్మిస్తున్నాం, ఎలక్ట్రానిక్స్ తయారీ సామర్థ్యాన్ని పెంచుకుంటున్నాం. వివిధ రకాల రెన్యువబుల్ ఎనర్జీ సాధనకు ఆ రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నాం. విశాఖపట్నాన్ని ఏఐ, డేటా సెంటర్ హబ్ గా అభివృద్ధి చేస్తున్నాం. 6 గిగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లు పోర్టు సిటీలో రాబోతున్నాయి. భవిష్యత్ తరం పరిశ్రమలకు అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బ్యాక్ బోన్‌ను నిర్మిస్తున్నాం. ఇందులోకి భారీ పరిమాణంలో విశ్వసనీయ విద్యుత్ అవసరం ఉంటుంది. ఇందుకు సీజనల్ సాంప్రదాయ విద్యుత్ కాకుండా నాణ్యత కలిగిన కాలుష్య రహిత, తక్కువ ఖర్చుతో కూడిన రౌండ్–ది–క్లాక్ (24/7) ఇంధనం అవసరం. అందువల్లే ఎనర్జీ ప్లానింగ్ అన్నది ఆర్థిక ప్రణాళికలో కీలకాంశంగా మారింది. అందుకే ఆంధ్రప్రదేశ్ ఇంధన పరివర్తనపై దీర్ఘకాలిక, సమగ్ర దృక్పథాన్ని అవలంబిస్తోంది. మా ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీలో రెన్యూవబుల్స్, స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్ మిషన్ ఇన్‌ఫ్రా, మ్యానుఫ్యాక్చరింగ్ ఎకోసిస్టమ్, గ్రిడ్ ఆధునీకరణ రంగాల్లో సుమారుగా ?10 లక్షల కోట్లు పెట్టుబడులను మేం లక్ష్యంగా పెట్టుకున్నాం.

**భవిష్యత్తులో భారీగా విద్యుత్ అవసరం :** మేం వాస్తవ దృష్టితో ఆలోచిస్తున్నాం. భవిష్యత్ తరం పారిశ్రామిక వృద్ధికి పునరుత్పాదక శక్తి ఒక్కటే సరిపోదని మేము అర్థం చేసుకున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఏఐ కంప్యూట్ విస్తరిస్తున్న కొద్దీ, విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరుగుతోంది. కేవలం ఒక హైపర్‌స్కేల్ ఏఐ–నేటివ్ డేటా సెంటర్ ఒక మధ్యస్థ పట్టణం ఎంత విద్యుత్ వాడుతుందో అంత ఇంధనాన్ని ఉపయోగిస్తుంది. పెద్దఎత్తున డేటా సెంటర్లు, సెమికండక్టర్ పార్కులు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి క్లస్టర్లు, పారిశ్రామిక కారిడార్లను ఏకీకృతంగా అభివృద్ధి చేసేటప్పుడు భారీ పరిమాణంలో విద్యుత్ అవసరమవుతుంది. ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే ఈ పరిస్థితిని ప్రత్యక్షంగా చూస్తోంది. మేము ప్రస్తుతం భారతదేశంలోని అతిపెద్ద డేటా సెంటర్ ఎకోసిస్టమ్‌లలో ఒకటి నిర్మిస్తున్నాం. గ్లోబల్ కంపెనీలు ఏపీలో ముఖ్యంగా విశాఖపట్నంలో గిగావాట్ సామర్థ్యంగల ఏఐ–నేటివ్ డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చి, పెట్టుబడులు పెడుతున్నాయి.

**డేటాసెంటర్ల చుట్టూ తయారీ ఎకోసిస్టమ్ :** మా దృష్టిలో డేటా సెంటర్ అంటే కేవలం సర్వర్లతో కూడిన భవనాలకు ఆతిథ్యమివ్వడం కాదు. డేటా సెంటర్ ఎకోసిస్టమ్ చుట్టూ తయారీ ఎకోసిస్టమ్ కూడా నిర్మించాలన్నదే మా లక్ష్యం. మేం కేవలం భూమి, విద్యుత్ గురించి మాత్రమే ఆలోచించడం లేదు. ఫుల్ స్టాక్ గురించి ఆలోచిస్తున్నాం. కూలింగ్ సిస్టమ్స్ ను స్థానికంగా తయారు చేయడం, పవర్ ఎలక్ట్రానిక్స్ ఎకోసిస్టమ్‌లను నిర్మించడం, ట్రాన్స్‌ఫార్మర్స్ తయారీని ప్రోత్సహించడం, బ్యాటరీ స్టోరేజి సప్లయ్ చైన్స్, సెమీకండక్టర్–అనుసంధాన పరిశ్రమలను ఆకర్షించడంపై మేం దృష్టి సారించాం. ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ టెక్నీషియన్లు, ఎనర్జీ ఇంజనీర్లు, ఆధునిక తయారీ వర్క్‌ఫోర్స్ కోసం స్కిలింగ్ సంస్థలను నిర్మించడం ద్వారా ఎకో సిస్టమ్ అభివృద్ధి చేస్తున్నాం. ప్రాజెక్టుల వారీగా కాకుండా వివిధ దశల్లో క్లస్టర్లవారీగా సామర్థ్యాన్ని పెంచేందుకు కృషిచేస్తున్నాం. చరిత్రలో పారిశ్రామికంగా విజయం సాధించిన దేశాలు, ప్రాంతాలు విడివిడిగా పెట్టుబడులపై కాకుండా మొత్తం వాల్యూ చైన్‌లతో అభివృద్ధి చెందినవే. మేము ఏఐ, క్లీన్ ఎనర్జీ అవకాశాలను కూడా అదేవిధంగా అందిపుచ్చుకుంటున్నాం.

**న్యూక్లియర్ ఎనర్జీ సప్లయ్ చైన్ లో భాగస్వామ్యం :** న్యూక్లియర్ ఎనర్జీ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను కూడా అదే కోణంలో చూడాలని నేను నమ్ముతున్నాను. అయితే తరచుగా న్యూక్లియర్ ఎనర్జీ గురించిన చర్చలు కేవలం ఉత్పత్తి సామర్థ్యంపైనే కేంద్రీకృతమవుతాయి. కానీ అసలైన అవకాశం అంతకంటే చాలా పెద్దది. న్యూక్లియర్ ఎనర్జీ ఒక పూర్తి పారిశ్రామిక ఎకోసిస్టమ్‌గా మారుతుంది. ఆంధ్రప్రదేశ్ కు దీర్ఘకాలిక అవకాశం కేవలం న్యూక్లియర్ ఆస్తులను కలిగి ఉండటం మాత్రమే కాదు. పూర్తిగా న్యూక్లియర్ వాల్యూ చైన్‌లో భాగస్వామ్యం కావడమే. ప్రధానమైన విడిభాగాలను తయారుచేయడం, ప్రత్యేకమైన ఉక్కు, ఫాబ్రికేషన్ ఎకోసిస్టమ్‌లను అభివృద్ధి చేయడం, అత్యాధునిక ఇంజనీరింగ్ సామర్థ్యాలను నిర్మించడం వంటివాటిపై మేం దృష్టిసారిస్తాం. ప్రపంచస్థాయి భద్రతా ప్రమాణాలు, నిర్మాణ ప్రమాణాలను ఏర్పాటుచేయడం, భవిష్యత్ తరం న్యూక్లియర్ వర్క్‌ఫోర్స్‌కు శిక్షణ ఇవ్వడం, కచ్చితమైన మ్యానుఫ్యాక్చరింగ్ సప్లయ్ చైన్ లకు మద్దతు ఇవ్వడం, అత్యాధునిక న్యూక్లియర్ సాంకేతికతల చుట్టూ ఎగుమతుల పారిశ్రామిక ఎకోసిస్టమ్‌లను నిర్మించడం మా లక్ష్యం.

**ఎకో సిస్టమ్ నిర్మాణానికి సరైన సమయం :** న్యూక్లియర్ ప్రాజెక్టుల్ని కాకుండా న్యూక్లియర్ పారిశ్రామిక ఎకోసిస్టమ్‌లను నిర్మించడానికి ఇది సరైన సమయమని మేం భావిస్తున్నాం. దీర్ఘకాలిక మౌలికాంశాలు ఆకర్షణీయంగా ఉండటం మాత్రమే ఇందుకు కారణం కాదు. న్యూక్లియర్ ఎనర్జీ విశ్వసనీయ బేస్‌లోడ్ విద్యుత్ ను అందిస్తుంది. ఇది పునరుత్పాదక శక్తికి మంచిగా తోడ్పడుతుంది. అస్థిరమైన ఫాసిల్ ఫ్యూయెల్స్ మార్కెట్లపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. ముఖ్యంగా ప్రాజెక్టుల జీవితకాలంలో అత్యంత పోటీదారుగా, ఊహించదగిన లెవలైజ్డ్ కాస్ట్ ఆఫ్ ఎనర్జీని (రాజూజు) అందిస్తుంది. 20లేదా 30 ఏళ్ల పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే డేటా సెంటర్లు, సెమీకండక్టర్ వంటి పరిశ్రమలకు భవిష్యత్ అంచనా ముఖ్యం. తయారీరంగంలో ప్రధాన పోటీదారుగా నిలవడంలో దీర్ఘకాలిక విద్యుత్ ధరలు కీలకంగా ఉంటాయి. ఇది మొత్తం ఆర్థిక వ్యవస్థలకు ఒక వ్యూహాత్మక ప్రయోజనం చేకూరుస్తుంది. మోడరన్ న్యూక్లియర్ సాంకేతికతలు అభివృద్ధి చెందుతున్న కొద్దీ భద్రతా ప్రమాణాలు కూడా భారీగా మెరుగుపడుతున్నాయి.

**ఇంధన భవిష్యత్ పైనే ఏఐ భవిష్యత్ :** ప్రపంచవ్యాప్తంగా ప్యాసివ్ సేఫ్టీ సిస్టమ్స్, మాడ్యులర్ డిజైన్‌లు, డిజిటల్ మానిటరింగ్, ఆటోమేషన్, ఆపరేషనల్ రెసిలియన్స్‌లో ప్రధాన ఆవిష్కరణలు కనిపిస్తున్నాయి. న్యూక్లియర్ ఎనర్జీకి సంబంధించి ప్రపంచవ్యాప్త చర్చ శైలి మారుతోందని నేను భావిస్తున్నాను. న్యూక్లియర్ ఎనర్జీ పాత్ర లేకుండా భారీ కర్బన ఉద్గారాల తగ్గింపు, పారిశ్రామికస్థాయి విద్యుదీకరణకు విశ్వసనీయ మార్గంలేదని ప్రపంచదేశాలు క్రమంగా గుర్తిస్తున్నాయి. ఏఐ విప్లవం ఈ గుర్తింపును మరింత వేగవంతం చేస్తోంది. ప్రపంచంలోని అతిపెద్ద టెక్ కంపెనీలు ఇప్పుడు నేరుగా దీర్ఘకాలిక న్యూక్లియర్ భాగస్వామ్యాలను పరిశీలిస్తున్నాయి. ఏఐ భవిష్యత్తు ఇంధన భవిష్యత్తుపై ఆధారపడి ఉంటుంది. భవిష్యత్ లో నమ్మకమైన, స్వచ్ఛమైన బేస్ లోడ్ విద్యుత్ తప్పనిసరిగా ఉండాలి. ఇది ప్రభుత్వాలు, టెక్నాలజీ ప్రొవైడర్లు, తయారీదారులు, పెట్టుబడిదారుల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాలకు అపారమైన అవకాశాలను సృష్టిస్తుంది. ఆంధ్రప్రదేశ్ ఆ భవిష్యత్తులో భాగస్వామ్యం వహించాలని కోరుకుంటోంది.

భారత్–అమెరికా సహకారం ఇప్పటికే సాంకేతికత, రక్షణ, సెమీకండక్టర్లు, క్లీన్ ఎనర్జీ వంటి రంగాల్లో మార్పులు తెచ్చింది. ఆ వ్యూహాత్మక భాగస్వామ్యంలోని తదుపరి ప్రధాన అధ్యాయం న్యూక్లియర్ ఎనర్జీ కాగలదని నేను బలంగా నమ్ముతున్నాను. ఇది కేవలం ఎనర్జీ భాగస్వామిగా మాత్రమే కాకుండా... ఒక పారిశ్రామిక భాగస్వామ్యంగా, తయారీ భాగస్వామ్యంగా, ఆవిష్కరణల భాగస్వామ్యంగా, అభివృద్ధి భాగస్వామ్యంగా, ఏఐ యుగానికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బ్యాక్ బోన్ నిర్మాణానికి తోడ్పడే భాగస్వామ్యంగా ఉండాలని నేను కోరుకుంటున్నాను. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం ఎనర్జీ, పారిశ్రామిక పునాదులను నిర్మిస్తున్న తరుణంలో మేము దీర్ఘకాలిక దార్శనికతను పంచుకునే గ్లోబల్ నేతలతో కలిసి పనిచేయాలని ఎదురుచూస్తున్నాం. ముందున్న అవకాశం అపారమైంది. పారదర్శకమైన అభివృద్ధిని సాధించడానికి, ఉన్నతశ్రేణి నాణ్యమైన ఉద్యోగాల్ని సృష్టించడానికి, ఎనర్జీ భద్రతను బలపరచడానికి, అత్యాధునిక తయారీకరణను వేగవంతం చేయడానికి, గ్లోబల్ ఆర్థిక వ్యవస్థ తదుపరి యుగానికి శక్తినిచ్చేందుకు ఈరోజు ఇక్కడికి వచ్చిన ప్రతినిధులకు ధన్యవాదాలు. ఇక్కడి చర్చలు దీర్ఘకాలిక భాగస్వామ్యాల నిర్మాణం దిశగా సాగాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.

# నేడు 'మత్స్యకార చేయూత' ప్రారంభం..

(మొదటి పేజీ తరువాయి)



**రాష్ట్రవ్యాప్తంగా 1.30 లక్షల కుటుంబాలకు రూ.262 కోట్లు లబ్ధి :** రాష్ట్రవ్యాప్తంగా 1.30 లక్షల కుటుంబాలకు రూ. 262 కోట్లు లబ్ధి చేకూరనుంది, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో ప్రారంభమవుతున్న ఈ పథకం ద్వారా గతంలో ఇచ్చిన మాట ప్రకారం వేట నిషేధ భృతిని రూ. 20 వేలకు పెంచి, సీజన్ సమయానికే నిధులు విడుదల చేయడంపై బెస్తవాడల్లో ఆనందోత్సవాలు వెల్లువెత్తుతున్నాయి. సామాజిక పింఛన్ల పెంపు, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్ల అందజేత వంటి ప్రజాకర్షక పథకాలతో దూసుకుపోతున్న కూటమి సర్కారు.. ఇప్పుడు మత్స్యకారులకూ అండగా నిలిచి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నామని చాటిచెప్పింది.

**జిల్లాలో పెరిగిన లబ్ధిదారులు:** శ్రీకాకుళం జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో (2025–26) 15,548 మంది మత్స్యకారులకు రూ. 31.09 కోట్లు పంపిణీ చేయగా, ఈ ఏడాది (2026–27) లబ్ధిదారుల సంఖ్య మరింత పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా 16,737 మంది అర్హులైన మత్స్యకారులను గుర్తించి, వారికి రూ. 33,47,40,000/–(రూ. 33 కోట్ల 47 లక్షల 40 వేలు) నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులు మంగళవారం (మే 19న) లబ్ధిదారులందరికీ అందనున్నాయి. సాంప్రదాయ తెప్పలపై వేటాడే నాన్–మోటరైజ్డ్ పడవల మత్స్యకారులను సైతం ఈ పథకంలో చేర్చి ప్రభుత్వం ఉదారత చాటుకుంది.

**తీర ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు:** వేట నిషేధ సమయాల్లోనే కాకుండా, మిగిలిన రోజుల్లోనూ మత్స్యకారులకు స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సుదీర్ఘ తీర ప్రాంతం ఉన్న శ్రీకాకుళం జిల్లా అభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నానని, అందరి బతుకుల్లో వెలుగులు నింపడమే తమ ధ్యేయమని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే జిల్లాలో ప్రతిష్టాత్మక మూలపేట పోర్టు అభివృద్ధితో పాటు, వివిధ దశల్లో ఉన్న జెట్టీల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచేలా కూటమి సర్కారు కార్యాచరణను సిద్ధం చేసిందని మంత్రి వివరించారు.

# పోలీస్ స్టేషన్‌కు జోగి రమేశ్.. మామిళ్లపల్లిలో ఉద్రిక్తత



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా మామిళ్లపల్లిలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. మొక్క జొన్న రైతులను పరామర్శించేందుకు మామిళ్లపల్లికి వెళ్లేందుకు మాజీ మంత్రి జోగి రమేశ్ యత్నించారు. అయితే అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, జోగి రమేశ్ మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో స్థానికంగా అరుపులు, కేకలతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. మొక్క జొన్న రైతులను పరామర్శించేందుకు వెళ్తున్న తమపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని జోగి రమేశ్ మండిపడ్డారు. అధికార పార్టీకి పోలీసులు అనుకూలంగా పని చేస్తున్నారని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గోడౌన్‌లో నిల్వ ఉంచిన మొక్క జొన్న సీజ్

కాగా మామిళ్లపల్లిలో ఓ గోడౌన్‌లో నిల్వ ఉంచిన మొక్క జొన్నను అధికారులు సీజ్ చేశారు. అయితే ఈ గోడౌన్ వైసీపీ నేతకు చెందినది కావడంతో రాజకీయ దుమారం చెలరేగింది. స్థానిక వైసీపీ నేత అంబటి మురళి వర్సెస్ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రగా మారింది. రెండు వర్గాల శ్రేణుల మధ్య మాటలయుద్ధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో వైసీపీ నేతలు మామిళ్లపల్లికి వెళ్లేందుకు యత్నించడంతో స్థానికంగా ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని అదుపు చేస్తున్నారు. మామిళ్లపల్లికి వెళ్లేందుకు యత్నించిన మాజీ మంత్రి జోగి రమేశ్‌ను సైతం పోలీసులు అడ్డుకోవడంతో పోలీసుల తీరుపై వైసీపీ నేతలు విమర్శలు కురిపిస్తున్నారు. ప్రస్తుతం జోగి రమేశ్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలుస్తోంది.

# నీటిపారుదల రంగానికి కొత్త దిశ




(మొదటి పేజీ తరువాయి)

నవంబర్ 2026లో నేరేడి బ్యారేజ్ శంకుస్థాపన జరగనుందన్నారు. 2026 డిసెంబర్ నాటికి పెన్నా–సర్వేపల్లి రిజర్వాయర్ పూర్తి చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. 2027 జనవరి నాటికి మడ్డువలస స్టేజ్–2 పూర్తి కావడంతో పాటు నీవా బ్రాంచ్ కెనాల్ మూలపల్లి వరకు ప్రారంభం కానుందన్నారు. 2027 ఏప్రిల్ నాటికి హీరమండలం ఎత్తిపోతల లిఫ్ట్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందన్నారు. 2027 జూన్ నాటికి నాగావళి–చంపావతి నదుల అనుసంధానం, బుడమేరు వరద రక్షణ పనులు, కొల్లేరు ప్రక్షాళన, ముక్త్యాల ఎత్తిపోతల పథకం మరియు పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించబడిందన్నారు. 2027 జూలై నాటికి వంశధార స్టేజ్–2, చింతలపూడి ఎత్తిపోతల పథకం, మహేంద్రతనయ–గజపతినగరం బ్రాంచ్ కెనాల్స్, తోటపల్లి డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించడం జరిగిందన్నారు. 2027 డిసెంబర్ నాటికి మూలపల్లి లిఫ్ట్ ద్వారా కళ్యాణి డ్యామ్ వరకు నీటి అనుసంధానం, మడకశిర బ్రాంచ్ కెనాల్, జంజావతి రిజర్వాయర్ ప్రాజెక్టు పూర్తి చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. 2028 డిసెంబర్ నాటికి తారకరామ సాగర్, వేదావతి ఎత్తిపోతల ప్రాజెక్టు, అనంతపురం జిల్లాలో భైరవానితిప్ప, అప్పర్ పెన్నార్ ప్రాజెక్టులు, విస్తరణ (కడప–రాజంపేట–కోడూరు), సోమశిల–స్వర్ణముఖి లింక్ కెనాల్, గోదావరి డెల్టా ఆధునీకరణ, SRMC విస్తరణ (40,000 నుండి 80,000 క్యూసెక్లకు), GNSS కోడూరు వం–కు విస్తరణ, అలాగే వరికపూడిశల ప్రాజెక్టు పూర్తి చేయాలని సమగ్ర లక్ష్య ప్రణాళిక రూపొందించబడిందన్నారు. ఈ విధంగా 2026 నుండి 2028 వం–కు రాష్ట్ర నీటిపారుదల రంగాన్ని సమూలంగా మారుస్తూ, ప్రతి ప్రాజెక్టుకు స్పష్టమైన లక్ష్యం, గడువు, అమలు దిశను ప్రభుత్వం ఖరారు చేసిందని మంత్రి తెలిపారు.

**చరిత్ర సృష్టించిన తొలి విజయాలు :** హెచ్ఎన్ఎస్ఎస్ ఫేస్–1 విషయంలో గత ప్రభుత్వం ఐదేళ్లలో చేయలేని పనిని ఈ ప్రభుత్వం కేవలం 20 నెలల్లోనే రూ. 3,860 కోట్ల వ్యయంతో 728 కి.మీ మేర విజయవంతంగా పూర్తి చేసిందన్నారు. కృష్ణా జలాలను రాయలసీమకు తరలించే ఈ కీలక ప్రాజెక్టు 2025 జూలై నాటికి లక్ష్యాన్ని చేరుకుని చారిత్రక ఘట్టంగా నిలిచిందన్నారు. అదేవిధంగా పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ (పావీజ) విషయంలో గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయని స్థితిలో, ఈ ప్రభుత్వం 20 నెలల్లోనే రూ. 1,400 కోట్లు వెచ్చించి కీలక నిర్మాణ పనులను వేగవంతం చేసింది. హిల్ కట్టింగ్, పంపింగ్ వ్యవస్థల వంటి క్లిష్టమైన పనులు శరవేగంగా కొనసాగుతూ, 2026 జూలై నాటికి ఉత్తరాంధ్రకు నీటిని అందించే లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందన్నారు. మూడు దశాబ్దాల కలగా మిగిలిపోయిన వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్––1ను 2026 ఆగస్టు నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించడం జరిగిందన్నారు. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు జీవనాధారంగా నిలిచే ఈ ప్రాజెక్టు వేగంగా పురోగమిస్తోందన్నారు.

**పోలవరం ప్రాజెక్టు పునరుద్ధరణ :** పోలవరం ప్రాజెక్టు గత పాలనలో డయాఫ్రామ్ డ్యామేజీపై వాస్తవాలు దాచిపెట్టి, అసెంబ్లీలో తప్పుడు గడువులు ప్రకటించిన పరిస్థితుల్లో అనిశ్చితికి లోనైందన్నారు. ఈ పరిస్థితిని సరిచేస్తూ, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు గారు ప్రాజెక్టును స్వయంగా సందర్శించి, 2027 జూన్/జూలై నాటికి ప్రాజెక్టు పూర్తి చేయాలనే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. దీంతో ప్రాజెక్టు తిరిగి పురోగతి దిశగా సాగుతోంది.

రాష్ట్రంలో సుమారు 8 లక్షల ఎకరాలు లిఫ్ట్ ఇరిగేషన్‌పై ఆధారపడి ఉన్నాయని, గత పాలనలో 1,040 లిఫ్టుల్లో కేవలం 156 మాత్రమే పనిచేసే స్థితికి దిగజారాయన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా లిఫ్టు మరమ్మతులు మరియు నిర్వాహణ బాధ్యతలను 10 సంవత్సరాల పాటు ఒకే ఏజెన్సీకి అప్పగించే విధానం తీసురానున్నట్లు మంత్రి తెలిపారు. దీని ద్వారా నిరంతర నిర్వహణ, నిధుల వినియోగ పారదర్శకత, రైతులకు స్థిరమైన నీటి సరఫరా సాధ్యమవుతుందన్నారు.

**వాటర్ క్యాలెండర్ -- ప్రణాళికాబద్ధ నీటి విడుదల విధానం :** మొదటిసారిగా రాష్ట్రచరిత్రలో ప్రతి ప్రధాన డెల్టా, ప్రాజెక్టుకు సంబంధించి నీటి విడుదల తేదీలను స్పష్టంగా ప్రకటిస్తూ వాటర్ క్యాలెండర్ విడుదల చేయబడుతుందన్నారు. పెన్నా డెల్టా కి ఇప్పటికే మే–4 వ తేదీ నుండి సాగు నీటిని విడుదల చేస్తున్నామని, గోదావరి డెల్టాకు జూన్–1 వ తేదీ నుండి, గాలేరు–నగరి సుజల స్రవంతి (జిఎన్ఎస్ఎస్) కింద ఉన్న ఆయకట్టుకు జూన్–10వ తేదీ నుండి, టిజిపి కడప (ఎస్పీవీబీఆర్ కడప) కు జూన్–15 నుండి సాగు నీటిని విడుదల చేస్తామని తెలిపారు. ఉత్తరాంధ్రలోని వంశధార ఆయకట్టుకు జూన్–15వ తేదీ నుండి, తోటపల్లి ఆయకట్టుకు జూలై–1 నుండి, కృష్ణా డెల్టా ఆయకట్టుకు జూలై–1వ తేదీ నుండి, ఏలేరు రిజర్వాయర్ కింద ఉన్న ఆయకట్టుకు జూలై–10 నుండి, కేసి కెనాల్, తెలుగుగంగ, ఎస్ఆర్‌బిసి, టిబిపిఎల్ఎల్‌సి, తాడిపూడి, పుష్కర ప్రాజెక్టుల కింద ఉన్న ఆయకట్టు కు జూలై–15 నుండి, టిబిపి హెచ్ఎల్‌సి కింద ఉన్న ఆయకట్టుకు జూలై–20 నుండి, హంద్రీనీవా సుజలస్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ఆయకట్టుకు జూలై–31 నుండి, నాగార్జున సాగర్ ఆయకట్టు కింద జోన్–1 (పల్నాడు, గుంటూరు, బాపట్ల) కు జూలై –31 న, జోన్–2 (ప్రకాశం, మార్కాపురం) ఆయకట్టుకు ఆగష్టు చివరి వారంలో సాగునీటి విడుదల చేయనున్నట్లు షెడ్యూల్ విడుదల చేశారు. దీనివల్ల వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ శాఖ సమన్వయంతో రైతులు ముందస్తుగా సిద్ధం కావడానికి అవకాశం కలుగుతుందని మంత్రి తెలిపారు.

**జలధార--జలహారతి కార్యక్రమం - ప్రజా ఉద్యమ దిశగా :** భూగర్భ జలాలను పెంపొందించి భూమినే రిజర్వాయర్‌గా మార్చే లక్ష్యంతో ప్రారంభించిన జలధార–జలహారతి కార్యక్రమం ప్రస్తుతం వంద రోజుల ప్రణాళికలో కొనసాగుతోంది. ఈ కార్యక్రమాన్ని ప్రతి వారం సమీక్షిస్తూ, ప్రతి క్యాబినెట్ సమావేశంలో పురోగతిని పరిశీలిస్తూ ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

# దివంగత రామిళ్ల రవీంద్రకుమార్ 5వ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమం




**రామ్ మందిర్ ఏరియా, మే 18 (జర్నలిస్ట్ ఫైల్) :** గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన రామిళ్ల రామలింగం--మంగళ దంపతులు తమ కుమారుడు దివంగత రామిళ్ల రవీంద్రకుమార్ 5వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఫైవ్ ఇంక్లైన్ ప్రాంతంలోని అమ్మ పరివార్ ఆశ్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి అన్నప్రసాద వితరణ చేపట్టి ఆశ్రమంలోని నిరాశ్రయులకు భోజన సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, కరోనా కారణంగా కుమారుడిని కోల్పోయినప్పటికీ ఆయన జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం జయంతి, వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రామిళ్ల కుటుంబం అభినందనీయమని పేర్కొన్నారు. సమాజంలోని దాతలు కూడా వీరిని స్ఫూర్తిగా తీసుకుని నిరాశ్రయులు, అవసరమైన వారికి సహాయం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామిళ్ల రామలింగం, మంగళ దంపతులతో పాటు కుటుంబ సభ్యులు రాజేంద్రకుమార్, శైలజ, వైష్ణవి, వణుష్ణ, విశ్వజిత్, రవీంద్రకుమార్, కృతిక్, మహేంద్ర కుమార్, గురుపాదం, మిత్రులు అక్బర్, రాము, మేజిక్ రాజా, చంద్రపాల్, అమ్మ పరివార్ ఆశ్రమ నిర్వాహకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ పరీక్ష ఫలితాలు విడుదల.




**సింగరేణి, (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ మోడల్ స్కూల్లో 6వ తరగతి ప్రవేశాలకు నిర్వహించిన ఎంట్రన్స్ ఫలితాలు ఆదివారం విడుదలైనట్లు ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్ ఎలియట్ తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశాలకు అర్హత సాధించిన విద్యార్థుల జాబితాను మోడల్ స్కూల్ నోటీస్ బోర్డుపై ఉంచటం జరిగిందన్నారు. ఎంపికైన విద్యార్థులు టీసీ, స్టడిసర్టిఫికెట్, కులం ధృవీకరణ, ఆధార్ కార్డు జిరాక్స్‌లు, రెండో పాస్ ఫోటోలతో పాఠశాలను సందర్శించాలని ప్రిన్సిపాల్ కోరారు. నిర్ణిత గడువు లోపే ప్రవేశాలు కల్పన ఉంటుందని తర్వాత మెరిట్ ప్రకారం ఇతర విద్యార్థులకు ప్రవేశాలు కల్పించటం జరుగుతుందన్నారు

# అపోహలు వీడి నేత్ర, అవయవ దానానికి ముందుకు రావాలి: సీఐ హనూక్



**బెల్లంపల్లి, మే 18 :** మరణానంతరం కూడా చేసే సేవ గొప్పది: సీఐ హనూక్‌బెల్లంపల్లి పట్టణంలోని ఇంక్లైన్ బస్తీకి చెందిన నేత్రదాత కీ.శే. రాచకట్ల శ్రీనివాస్ దశకర్మ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బెల్లంపల్లి రూరల్ సీఐ సీహెచ్ హనూక్, 6వ వార్డు కౌన్సిలర్ సల్ల కృష్ణవేణి పాల్గొని శ్రీనివాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐ హనూక్ మాట్లాడుతూ ప్రతి మనిషికి మరణం సహజమని, జీవించి ఉన్నప్పుడే ఇతరులకు ఉపయోగపడే విధంగా సేవ చేయాలని సూచించారు. నేత్రదానం ద్వారా మరణించిన తర్వాత కూడా ఇతరులకు చూపు ప్రసాదించే అవకాశం ఉంటుందని తెలిపారు. అవయవ దానం వల్ల ప్రాణాలు కాపాడవచ్చని, శరీరదానం వైద్య విద్యార్థుల పరిశోధనలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలందరూ అపోహలు వీడి నేత్ర, అవయవ, శరీర దానాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు .కౌన్సిలర్ సల్ల కృష్ణవేణి మాట్లాడుతూ తీవ్ర విషాదంలో ఉన్నప్పటికీ రాచకట్ల శ్రీనివాస్ కుటుంబ సభ్యులు నేత్రదానం చేయడం అభినందనీయమన్నారు. మరణించిన ఎనిమిది గంటలలోపు కార్నియా సేకరించి ఇద్దరికి చూపునివ్వవచ్చని వివరించారు. బ్రెయిన్ డెడ్ అయిన వారి అవయవాలను దానం చేస్తే పలువురి ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుమ్మల చందు, పెద్ది వినయ్ కుమార్, డోలి సుకుమార్, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం. మండలబిఆర్ఎస్ పార్టీ నాయకులు



**పెగడపల్లి, మే 18 (జర్నలిస్ట్ ఫైల్) :** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికే పెల్లి గ్రామానికి చెందిన ఓల్లాల వెంకటేశం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మండల బి ఆర్ఎస్ పార్టీ నాయకులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు లోకమల్లారెడ్డి, నాయకులు ఉప్పు గండ్ల నరేందర్ రెడ్డి , స్థానిక సర్పంచ్ ముంజ మహేశ్వరి- మధుకర్ గౌడ్, లింగాపూర్ గ్రామ సర్పంచ్ కా శెట్టి వీరేశం, మండల నాయకులు అందే వెంకటేశం, గ్రామ శాఖ అధ్యక్షులు మడిగల తిరుపతి, పోచంపల్లి రవి,మడిగెల మనోహర్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు,వార్డు సభ్యులు షకీల్, క్యాస గంగాధర్, పొనగంటి రాజయ్య, బెదిగం రాజు, నిమ్మ తిరుపతి, తుమ్మ సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ తీగలకు తాకి ట్రాక్టర్ ట్రాలీ దగ్ధం



**తాండూర్, మే 18 (జర్నలిస్ట్ ఫైల్) :** తాండూర్ మండలం అచ్చులాపూర్ గ్రామ సమీపంలోని నల్ల వాగు ప్రాజెక్టు మార్గంలో గురువారం ట్రాక్టర్ ట్రాలీకి అగ్ని ప్రమాదం జరిగింది. భామనపల్లి సంతోష్‌కు చెందిన ట్రాక్టర్ ట్రాలీ ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తాకడంతో గడ్డి ఉన్న ట్రాలీ పూర్తిగా దగ్ధమైంది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఘటన జరిగిందని స్థానికులు ఆరోపించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపు చేశారు. అప్పటికే ట్రాక్టర్ ట్రాలీ పూర్తిగా కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు.

# ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు.

**-ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చిన మంచి ఫలితాలు ప్రతి ఒక్కరికి తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలి..**
**-మండలాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలుపుతూ సన్మానించాలి..**
**-ప్రతి హైస్కూల్ పరిధిలో టాపర్ విద్యార్థుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి..**
**-ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.**



**పెద్దపల్లి, మే 18 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆదివారం రోజున సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన విద్యా వారోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణ రావు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి ప్రభుత్వ విప్ విజయరమణ రావు ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి 10వ తరగతి మరియు ఇంటర్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన 11 మంది విద్యార్థులను సన్మానిస్తూ, వారికి రూ.10 వేల చొప్పున నగదు బహుమతి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ...ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలలో పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకున్న 98 మందికి పైగా విద్యార్థులు 550కు పైగా మార్కులు సాధించడం ఆనందదాయకమని తెలిపారు. ఈ ఫలితాల సాధనలో కృషి చేసిన ఉపాధ్యాయులు, హెడ్ మాస్టర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.త రెండు సంవత్సరాలుగా విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునీకరణ పనులు, టాయిలెట్లు, అదనపు తరగతి గదులు, తాగునీటి సదుపాయాలు, చిన్నపాటి మరమ్మత్తులు వంటి అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి పూర్తి చేశారని అన్నారు. ప్రస్తుతం అనేక ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రంగా సందర్శించిన తెనుగువాడ పాఠశాల అప్పట్లో శిథిలావస్థలో ఉండేదని, అనంతరం దానిని పూర్తిగా ఆధునీకరణ చేసి ప్రజా ప్రభుత్వంలో అద్భుతంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడం సంతోషకరమని అన్నారు. పెద్దపల్లి పట్టణ పరిధిలో పదవ తరగతిలో 500కు పైగా మార్కులు సాధించిన 98 మంది విద్యార్థులు ఉన్నారని, మిగిలిన ఐదు గ్రామీణ మండలాల్లో 138 మందికి పైగా విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. వీరందరికి రాబోయే రోజుల్లో సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మరింత గుర్తింపు లభించడంతో పాటు ఉపాధ్యాయులు, హెడ్ మాస్టర్లు చేసిన కృషి సమాజానికి తెలియజేసే అవకాశం ఉంటుందని అన్నారు. వచ్చే ఏడాది సన్మానించే విద్యార్థుల సంఖ్య రెట్టింపు కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చిన మంచి ఫలితాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని కలెక్టర్ సహా ఉన్నతాధికారులను ప్రభుత్వ విప్ సూచించారు. ప్రతి హైస్కూల్ పరిధిలో మెరుగైన మార్కులు సాధించిన విద్యార్థుల ఫోటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. పిల్లల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఇంటర్ చదివే దశలో కొంతమంది విద్యార్థులు చెడు అలవాట్లకు గురయ్యే అవకాశమున్నందున అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి చెడు అలవాట్లకు ఆకర్షితులు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిఖనిలో చైన్ స్నాచింగ్ కలకలం



**-మహిళ మెడలోని రెండు తులాల బంగారు గొలుసు అపహరణ**

**రామ్ మందిర్ ఏరియా, మే 18 (జర్నలిస్ట్ ఫైల్) :** గోదావరిఖని తిలక్‌నగర్‌లో ఆదివారం జరిగిన చైన్ స్నాచింగ్ ఘటన స్థానికులను భయాందోళనకు గురిచేసింది. ఉదయం 9 గంటల సమయంలో తిలక్‌నగర్‌లోని డెవలప్మెంట్ సెంటర్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది .స్థానికుల వివరాల ప్రకారం, నంబర్ ప్లేట్ లేని గ్లామర్ బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ఒడ్నాల భూలక్ష్మి అనే మహిళ మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. ఘటనతో మహిళ ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. సమాచారం అందుకున్న ఏసీపీ మడత రమేష్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇటీవల బంగారం ధరలు భారీగా పెరగడంతో చైన్ స్నాచింగ్, దొంగతనాల ఘటనలు పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు మరింత నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు

# రాష్ట్ర మంత్రిచే రాచర్ల ఒమేగా సత్కారం




**-పదో తరగతిలో ఉత్తమ ఫలితాలతో స్కూల్ టాపర్‌గా గుర్తింపు**

**జగిత్యాల జిల్లా, మే 18 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన విద్యా వారోత్సవాల్లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అభినందించారు. ఆదివారం జగిత్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం రాములపల్లి గ్రామానికి చెందిన రాచర్ల ఒమేగా ను మంత్రి ప్రత్యేకంగా సత్కరించారు. జగిత్యాల పట్టణంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్‌లో చదివిన ఒమేగా పదో తరగతిలో స్కూల్ టాపర్‌గా నిలవడంతో మంత్రి ఆమెకు సర్టిఫికెట్, షీల్డ్ అందజేసి అభినందించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు

విద్యా వారోత్సవాలకు ఆర్జీయూకేటీలో ఘన ముగింపు

ఉచిత రక్త పరీక్షల శిబిరం,,,, 2036 వరకు సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై సమీక్ష

**నిర్మల్ జిల్లా, మే 18 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న విద్యావారోత్సవాలు -- విద్యా విజయోత్సవాల ముగింపు వేడుకలు రాజీవ్ గాంధీ నాలెడ్జ్ టెక్నాలజీస్ విశ్వవిద్యాలయం లో ఘనంగా నిర్వహించబడ్డాయి. విద్య, ఆరోగ్యం, సంస్థాగత అభివృద్ధి అనే మూడు కీలక అంశాలను సమన్వయం చేస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమం విశ్వవిద్యాలయ సిబ్బంది, అధ్యాపకుల్లో విశేష స్పందనను కలిగించింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో సిబ్బంది సంక్షేమం, ముందస్తు ఆరోగ్య రక్షణ లక్ష్యంగా ప్రత్యేక ఉచిత రక్త పరీక్షల శిబిరం నిర్వహించారు. ఉపకులపతి ప్రొఫెసర్ ఎ. గోవర్ధన్ మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని ఆయనతో పాటు ప్రత్యేక అధికారి ప్రొఫెసర్ ఇ. మురళీ దర్శన్ ప్రారంభించారు. సిబ్బందిలో ఆరోగ్య అవగాహన పెంపొందించడం, క్రమబద్ధమైన వైద్య పరీక్షల ప్రాధాన్యతను తెలియజేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. శిబిరం అనంతరం ఉపకులపతి, ఓఎస్డీ విశ్వవిద్యాలయంలోని పలు విభాగాలను సందర్శించి ఉద్యోగులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఆయా విభాగాల్లో ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి, విద్యా ప్రమాణాలు, బోధన - బోధనేతర సిబ్బంది పనితీరు, భవిష్యత్ అవసరాలపై సమగ్ర చర్చ చేపట్టారు. సంస్థను మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. ఆర్జీయూకేటీ బాసరను జాతీయ స్థాయిలో ఆదర్శ విద్యాసంస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో యంత్రాంగం వ్యూహాత్మక ప్రణాళికతో ముందుకు సాగుతోందని ఉపకులపతి వెల్లడించారు. అత్యాధునిక ప్రయోగశాలలు, స్మార్ట్ తరగతి గదులు, పరిశోధనా కేంద్రాలు, ఇన్‌క్యుబేషన్ వ్యవస్థలు, డిజిటల్ పాలనా

# మేడిపల్లిలో మామిడి తోట దగ్ధం




**జర్నలిస్ట్‌ఫైల్**వేములవాడనియోజకవర్గం ప్రతినిధి మల్లేశం గౌడ్ 200 మామిడి చెట్లు, డ్రిప్ పైపులు కాలిపోవడంతో రైతుకు భారీ నష్టంకేంద్రానికి చెందిన రైతు చీపిరి శెట్టి మల్లారెడ్డి కి చెందిన మామిడి తోటలో అగ్నిప్రమాదం సంభవించి భారీ నష్టం వాటిల్లింది. సర్వే నంబర్ 432లో ఉన్న 5 ఎకరాల 7 గుంటల మామిడి తోటలో ఆదివారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో రెండు ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న సుమారు 200 మామిడి చెట్లుపూర్తిగా దగ్ధమయ్యాయి. కాలిపోయిన చెట్లు ఐదు సంవత్సరాల వయస్సు కలిగి ఉండటంతో రైతుకు లక్షల్లో నష్టం వాటిల్లినట్లు తెలిసింది. తోటలో ఏర్పాటు చేసిన డ్రిప్ ఇరిగేషన్ పైపులు, ఇతర సామగ్రి కూడా మంటల్లో కాలిపోయాయి. సమాచారం అందుకున్న స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ప్రభుత్వం స్పందించి నష్టాన్ని అంచనా వేసి రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# వర్తక సంఘం అధ్యక్షునిగా ఆరవసారి ఏకగ్రీవ ఎన్నిక. గంప వెంకటరమణ



**పెగడపల్లి, మే 18 (జర్నలిస్ట్ ఫైల్) :** జగిత్యాల జిల్లా పెగడపల్లి వర్తక సంఘం అధ్యక్షునిగా ఆరవసారి ఏకగ్రీవంగా గంప వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి భాస్కర్, కోశాధికారిగా మాసూరి పార్థసారథి ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ నా ఎన్నికకు సహకరించిన వర్తక సంఘం మిత్రులందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని, సంఘ సభ్యులందరి సహకారంతో వర్తక సంఘాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం సభ్యులు మనోహర్,సుదర్శన్, మునీందర్, రవి, రాజేశం, అంజయ్య, వెంకటేశం, ఆంధ్ర తిరుపతి, శ్రీనివాస్, రాజశేఖర్, సుదర్శన్, తిరుపతి, రాజేశం, మల్లేశం తిరుపతి రెడ్డి, కొమరయ్య, శంకర్,,అంజయ్య ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ కోసం సమిష్టిగా పనిచేయాలి: టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి



**బెల్లంపల్లి, (జర్నలిస్ట్ ఫైల్):** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్తను కలుపుకొని సమిష్టిగా పనిచేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి సూచించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల కమిటీల నియామకాలలో భాగంగా కొత్త బాధ్యతలు చేపట్టిన బెల్లంపల్లి మండల నాయకులు నలిమల స్వామి, దుర్గం రాజం ఆదివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నలిమల స్వామికి జిల్లా జనరల్ సెక్రటరీగా, దుర్గం రాజంకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు లభించినందుకు నాతరి స్వామి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం, పీసీసీ , డీసీసీ , బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, ప్రజల్లో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం వారు తమపై పెట్టిన నమ్మకంకు పార్టీ అధిష్టానం, ఎమ్మెల్యే కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఎప్సెట్ ఫలితాల్లో “వెక్టార్” విద్యార్థుల హవా




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మే 18 (జర్నలిస్ట్ ఫైల్) : ఆదివారం విడుదలైన తెలంగాణ ఎప్సెట్ ఫలితాల్లో వెక్టార్ కళాశాల విద్యార్థులు విజయ దుందుభి



మోగించారు.ఇంజనీరింగ్ విభాగంలో మొర స్వగత్ శ్రీవాస్తవ 2630 వ ర్యాంకు సాధించగా,జి.శ్రీనిధి రెడ్డి 4163 వ ర్యాంకు సాధించగా,దువ్వ యశ్వంత్ 4939 ర్యాంకు సాధించగా ఎస్.మనస్విని 5653 ర్యాంకు సాధించారని కళాశాల ఛైర్మన్ మధుసూదన్ జోషి తెలిపారు.ఇరవై వేల ర్యాంకులను ఇరవై ఐదు మంది విద్యార్థులు సాధించారని తెలిపారు.ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు సంతోష్, కార్తిక్,గజానన్ అభినందించారు.

## అంగరంగ వైభవంగా రవికుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు




శేరిలింగంపల్లి (జర్నలిస్ట్ ఫైల్) : కాషాయ దళపతి కల్మషం లేని వ్యక్తి ప్రజల మంచి కోరే మానవత వాది ప్రతిక్షణం ప్రజల కోసం తపించే జనహృదయనేత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేద ప్రజల కోసం నిరంతరం తపించే యువ నాయకులు శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి రవికుమార్ యాదవ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ మసీదు బండ బిజెపి ఆఫీసు నందు ఆదివారం గ్రాండ్ గా బర్త్ డే సెలబ్రేషన్ చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్ బిజెపి సీనియర్ నాయకులు నల్లూరి పట్టాభిరామ్ బిజెపి సీనియర్ నాయకులు పార్నంది నాగులు మియాపూర్ డివిజన్ బిజెపి ఎస్సీ మోర్చా అధ్యక్షులు పత్తి బసవ శివ మియాపూర్ డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు మాధవి బిజెపి సీనియర్ నాయకులు బావురి చోటా రామ్ బిజెపి యువ మోర్చా నాయకులు సిరిపాటి దుర్గాప్రసాద్ చల్లా నవీన్ పత్తి శివమణి బావురి ప్రేమారాం బావురి సురేష్ కుమార్, సంఘ సేవకులు వై. వి రమణ తది తరులు పాల్గొన్నారు.

## పరోపకారం “మహా ధేయం” - హెల్పింగ్ హోమ్ - మంచి కార్యక్రమం

– కవి రామిశెట్టి రోషయ్య



మధిర, మే 18 (జర్నలిస్ట్ ఫైల్) : ఆదివారం మధిర పట్టణంలో స్థానిక అజాద్ రోడ్ లో ప్రముఖ సంఘ సేవకులు మధిర ఆశ మిత్ర లంకా కొండయ్య బృందం నిర్వహిస్తున్న హెల్పింగ్ హోమ్ మహాత్మా గాంధీ ఉచిత పాత బట్టల కేంద్రంనకు పలువురు దాతలు పాత దుస్తులు, పాత సామానులు శనివారం ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి ప్రముఖ విశ్రాంత ఉపాధ్యాయులు కవి రామిశెట్టి రోశయ్య కూటింభికులు తన ఇంటి వద్ద ఉన్న అదనపు స్టీల్ పాత్రలు బట్టలు కొండయ్యకు అందజేశారు. అదే విధంగా రాయపట్నం రోడ్డులో ఉన్న గుర్రాల రామకృష్ణారెడ్డి ఇనుప కడ్డీలు మంచం దుప్పట్లు చీరెలు, మక్కెన కల్పనా సాయి పాత పరుపు లు దిండ్లు వితరణ చేశారు. అదే విధంగా ఇంకా అనేక మంది దాతలు దుస్తులు వితరణగా వాటిని ఆదివారం ఉదయం నిరుపేద కుటుంబాలకు వెంటనే పంచి పెట్టారు. మానవ సేవే భగవంతుని సేవగా భావించి ప్రతి ఒక్కరు పేదలకు, అనారోగ్య బాధితులకు సహాయం చేయాలని ఇలాంటి సేవా కార్యక్రమం చేయటం అభినందనియం అని రామిశెట్టి రోశయ్య అన్నారు. మరోక దాత సమతా ఫిజియో థెరపిస్ట్ తాళ్లూరి నరేష్ కొండయ్య గృహంలో అంద జేశారు. ఈ కార్యక్రమంలో లంకా సేవ ఫౌండేషన్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## సనాతన ధర్మాన్ని కాపాడటంలో బ్రాహ్మణులు ముందుంటారు

గోసేవా సమితి జ్యేష్ట మాస కార్యక్రమంలో ఎమ్మెల్యే ధన్ పాల్...



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మే 18 (జర్నలిస్ట్ ఫైల్) : సనాతన ధర్మాన్ని కాపాడటంలో బ్రాహ్మణులు ఎల్లప్పుడూ ముందుంటారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు.గో సేవా సమితి ఆధ్వర్యంలో అధిక జ్యేష్ఠ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం 108 మంది బ్రాహ్మణ దంపతులకు వాయనం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....మూడు సంవత్సరాలకు ఒకసారి వచ్చే అధిక జ్యేష్ట మాసంలో ఇలాంటి కార్యక్రమాలు చేయడం ద్వారా పుణ్యం లభిస్తుందన్నారు.సమితి సభ్యులు గో సేవ చేయడమే కాకుండా..హిందూ ధర్మాన్ని కాపాడే అనేక కార్యక్రమాల్లో ముందు ఉండడం అభినందనీయం అన్నారు.అలాగే వైశ్యులు ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు.కార్యక్రమంలో గో సేవా సమితి అధ్యక్షుడు వీరమల్లు రమేష్,లక్ష్మీకాంతం గుప్తా,యాదగిరి గుప్తా,యంసాని రవీందర్ గుప్తా,బ్రాహ్మణులపల్లి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే గురుతర బాధ్యత గురువులదే

## విద్యా విజయోత్సవంలో అర్బన్ ఎమ్మెల్యే,కలెక్టర్ వెల్లడి

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మే 18 (జర్నలిస్ట్ ఫైల్) : చక్కటి విద్యా బుద్ధులు నేర్పించి భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే గురుతర బాధ్యతను ఉపాధ్యాయులు సమర్థవంతంగా నిర్వహించాలని నిజామాబాద్ అర్బన్ శాసన సభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా,కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు.ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజులో భాగంగా విద్యా శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యా వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించారు.ఈ





సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే మాట్లాడుతూ....భావి భారత పౌరులైన విద్యార్థులకు చక్కటి భవిష్యత్తును అందించాల్సిన బాధ్యత గురువులదేనన్నారు.అందుకే సమాజంలో గురువులకు ఎంతో గౌరవం,గొప్ప స్థానం ఉందని గుర్తు చేశారు.2047 వరకు భారతదేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దాలనే ప్రధాని నరేంద్ర మోడీ సంకల్పాన్ని సాకారం చేసేవిధంగా విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు.ఏ లక్ష్య సాధనకైనా చదువు ఎంతో తోడ్పాటును అందిస్తుందని చెప్పారు.విద్యారంగంపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్న ఫలితంగా ప్రైవేట్,కార్పోరేట్ స్కూల్స్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలను నమోదు చేస్తున్నాయన్నారు.నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ బడుల విద్యార్థులు సాధించిన ఫలితాలే ఇందుకు నిదర్శనం అని పేర్కొన్నారు.అయితే విద్యార్థులు కేవలం మార్కుల సాధనకే పరిమితం కాకుండా,నాణ్యమైన విద్యను ఆర్జించాలన్నారు.కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ....ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని అన్నారు.స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని,కలలను సాకారం చేసుకునే దిశగా నిజాయితీతో ముందుకు వెళ్లాలని మార్గనిర్దేశం చేశారు.భవిష్యత్తులో స్థిరపడేందుకు పదవ తరగతి తరువాత ఎంచుకునే మార్గం ఎంతో కీలకం అయినందున,ఇష్టమైన సబ్జెక్టులతో కూడిన కోర్సులలో చేరాలన్నారు.ఎంచుకున్న గమ్యాన్ని ఎలా చేరుకోవాలి అనే దానిపై స్పష్టత కలిగి ఉండాలని,ఆ దిశగా అంకిత భావంతో కృషి చేస్తే తప్పకుండా లక్ష్యాన్ని చేరుకోగల్గుతారని అన్నారు.స్మార్ట్ ఫోన్లకు అలవాటు పడకుండా పుస్తక పఠనంను అభిరుచిగా మలుచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ,రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్,డీఈవో అశోక్,బీ.సీ.,మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు నర్సయ్య,కృష్ణవేణి,జిల్లా పౌర సంబంధాల అధికారిణి ఎన్.పద్మశ్రీ,డీసీఈబీ సెక్రెటరీ సీతయ్య,జీఈసీఓ భాగ్యలక్ష్మి, ఎం.ఈ.ఓలు, హెచ్.ఎంలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలి

: జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



చింతూరు, మే 18 (జర్నలిస్ట్ ఫైల్) : పోలవరం జిల్లాలోని పదవ తరగతి పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఆయా సబ్జెక్టులకు అర్థమయ్యే రీతిలో, ఒకటికి రెండుసార్లు, బోధించాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ సంబంధిత ఉపాధ్యాయులను ఆదేశించారు. శనివారం రాత్రి చింతూరు మండలంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాల నర్సింహా పురం లో పదవ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లమెంటరీ పరీక్షలకు ఏ విధముగా ఆయా సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఏ విధంగా బోధించుచున్నది పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్, చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి శుభం నౌక్వాల్ పరిశీలించారు.ఈ సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ పోలవరం జిల్లాలోని ఈ సంవత్సరం పదవ తరగతి లో వివిధ సబ్జెక్టులలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఆయా సబ్జెక్టులకు ఒక్కొక్కరికి ప్రత్యేకంగా పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలలో ఒక్కొక్క ప్రశ్నకు ఏవిధంగా జవాబులు వ్రాయాలో, పాఠాలు చెప్పాలని ఆయన అన్నారు. ఈ గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఎంతమంది పదవ తరగతి ఫెయిల్ అయిన బాలికలు ఉన్నది ఆయన ఆరా తీశారు. ఈ సప్లమెంటరీ పరీక్షలకు ప్రత్యేక క్లాసులకు వచ్చిన బాలికలకు ప్రతిరోజు ఏ విధంగా ఆహార పదార్థాలు అందించుచున్నది ఆయన ఆరా తీశారు. జిల్లా కలెక్టర్, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి శుభం నోక్వాల్ కలిసి విద్యార్థులతో భోజనం చేయడం జరిగింది. ఈ సప్లమెంటరీ పరీక్ష కేంద్రంలో ఏ విధంగా ఉపాధ్యాయులు సబ్జెక్టులు వారిగా చదువు చెబుతున్నది లేనిది అదేవిధంగా అర్థమవుచున్నది లేనిది విద్యార్థులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

## ఇంటర్ విద్యార్థినిలకు ఘనంగా సన్మానం



ఏన్కూర్, మే 18 (జర్నలిస్ట్ ఫైల్) : విద్యా వార్షికోత్సవాలు భాగంగా ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏన్కూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించిన ఉమామహేశ్వరి (990),ఎం శైలజ (986), శ్రావ్య (976) సాధించిన విద్యార్థినిల ను శాలువా తో సన్మానించి , పదివేల రూపాయల నగదు బహుమతులు డిఇఓ చైతన్య జై ని , డి ఐ ఈ ఓ రవిబాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ... ఏన్కూరు కళాశాలలో అధ్యాపక బృందం విద్యార్థుల ను తీర్చి దిద్దుతూ కళాశాల అభివృద్ధి కోసం పాటు పడుతున్నారని ఆయన అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ మీటి కోటీ సింహాచలం తోపాటు అధ్యాపక బృందానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనరసింహ ,శివ, అధ్యాపకులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీ పిలుపుతో ఎలక్ట్రిక్ వాహనంలో అర్బన్ ఎమ్మెల్యే



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మే 18 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు పెట్రోల్,డీజిల్ ఆదా చేయాలనే ఉద్దేశంతో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఆదివారం ఈవీ (ఎలెక్ట్రిక్ వెహికల్ )లో ప్రయాణించారు.నగరంలోని పలు కార్యక్రమాలకు ఈవీ కారులోనే వెళ్లి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....యుద్ధ వాతావరణ నేపథ్యంలో క్రూడ్ ఆయిల్ ధరలు పెరుగుతున్నాయని,వాటిని నియంత్రించేందుకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారని చెప్పారు.భారతదేశం 85 శాతం పెట్రోల్,డీజిల్ లను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటామన్నారు.కావున ఆర్థిక మాంద్యాన్ని ముందుగానే అంచనా వేసిన ప్రధాని మోదీ బంగారం,పెట్రోల్,డీజిల్,వంట నూనె తదితర వాటిని ఆదా చేయాలని పిలుపునిచ్చారని పేర్కొన్నారు.ఇందులో భాగంగానే తాను ఎలక్ట్రిక్ వాహనంలో కార్యక్రమాలకు హాజరు కావడం జరుగుతుందన్నారు.ప్రతి ఒక్కరు ప్రధాని మోదీ పిలుపును పాటిస్తూ ముందుకెళ్లాలని చెప్పారు.

## ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగ జరుపుకునే విధంగా పాలకులు చర్యలు చెపట్టాలి

: మొహమ్మద్ సలాం



ఖమ్మం, మే 18 (జర్నలిస్ట్ ఫైల్) : ఈ నెల 28 న ప్రపంచ వ్యాప్తంగా పవిత్రంగా జరుపుకునే బక్రీద్ పండుగను ప్రశాంతమైన వాతవరణంలో జరుపుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బక్రీద్ పండుగ వస్తుందని అంటేనే “బలి “ అని రెచ్చగొడుతూ అడ్డంకులు సృష్టిస్తున్నారని ఇప్పటికే అన్ని రకాల జంతువుల వ్యాపారస్థుల పై ఒత్తిడి తీసుకోరావటం, ముస్లింల ఏ పండుగ వచ్చిన ఏదో ఒక రకంగా దాన్ని ప్రజల దృష్టిలో ఒక తప్పుడు సమాచారంగా తీసుకోపోవటం ఒక ఆనవాయితీగా మారిందని తంజీమ్ - ఎ -ఇన్సాఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మొహమ్మద్ సలాం తీవ్రంగా విమర్శించారు. ఎక్కడ అడ్డంకులు సృష్టించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రశాంతంగా బక్రీద్ ను జరుపుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సలాం డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా అధ్యక్షులు షేక్ సైదా అధ్యక్షతన ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాయకులు నిజాంపేట్ యాఖుబ్, ఎండీ. రెహమాన్, షేక్. చానా, డాక్టర్ ఖాసీం పాషా తదితరులు పాల్గున్నారు.

## లేబర్ కార్డుతో ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి:తెలంగాణ ఆల్ బిల్డింగ్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నగళ్ల రామచంద్రయ్య.



రాజేంద్రనగర్, మే 18 (జర్నలిస్ట్ ఫైల్) : లేబర్ కార్డుతో కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ ఆల్ బిల్డింగ్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చెన్నగల రాంచంద్రయ్య తెలిపారు.ఆదివారం రాజేంద్రనగర్ జోన్ లోని శివరాంపల్లిలో యూనియన్ ఆధ్వర్యంలో వర్కర్స్ కి రక్షణ పరమైన చర్యలపై కార్మికులకు అవగాహన కల్పించారు.కార్మికులు పనిచేస్తున్న క్రమంలో ముందస్తుగా రక్షణ చర్యలు లేకుంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రతి అమావాస్య రోజు కార్మికులు ఎలాంటి పనులకు వెళ్ళరాదని,సెలవుదినంగా పాటించాలని సూచించారు.కార్మికుల సంక్షేమం కోసం ఈ యూనియన్ అవిరాళంగా కృషి చేస్తుందన్నారు.కార్మికులకు ఎవరికైనా ఆపద వచ్చినా,ప్రమాదం జరిగిన వారికి యూనియన్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.కొందరు యాజమాన్యాలు పనికి ముందు ఒక రేటు,పని ముగిశాక మరో రేటు కూలి ఇవ్వడంతో మోసం చేస్తున్నారని,ఇలాంటి ఘటనలు జరగకుండా కార్మికులకు న్యాయం చేసేందుకు యూనియన్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు.కార్మికులకు పని చేసే క్రమంలో రక్షణ పరమైన చర్యలు తీసుకోవడంతో పాటు చట్ట ప్రకారం కార్మికులకు పని వేతనాలను అందించాల్సిన అవసరం ఉందన్నారు.రక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్ల ఎంతోమంది కార్మికులు భవన నిర్మాణంలో పని చేస్తున్న క్రమంలో ప్రమాదాలకు గురవడమే కాకుండా ప్రాణాలను సైతం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి కార్మికుడు యూనియన్ సభ్యత్వం తీసుకోవాలని కోరారు.ముమ్మందు కార్మికుల సంక్షేమం కోసం యూనియన్ కార్మిక చట్ట ప్రకారం వచ్చే సదుపాయాలు,సౌకర్యాలు,హక్కుల సాధన కోసం యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రైవేట్ ఎంప్లాయిస్ స్కిల్ అండ్ స్కిల్డ్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆదిరాల రవికుమార్,యూనియన్ ఉపాధ్యక్షులు అశోక్,ప్రధాన కార్యదర్శి ఎన్ యాదగిరి,కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి,కోశాధికారి రవీందర్ రెడ్డి,యూనియన్ నాయకులు జంగయ్య యాదవ్,యాదయ్య,జంగయ్య,ఎన్ రాజ్ కుమార్,పి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## విద్యార్థులను అభినందించిన ఎం ఈఓ శైలజ లక్ష్మి



ఖమ్మం, మే 18 (జర్నలిస్ట్ ఫైల్) : మండల విద్యా వనరుల కేంద్రం ఖమ్మం నందు విద్యా శాఖ అధికారి శైలజ లక్ష్మి అధ్యక్షతన ఖమ్మం అర్బన్ గవర్నమెంట్ పాఠశాలలో అత్యధికంగా మార్కులు సాధించిన విద్యార్థులకు ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ తరపున రీజియన్ ప్రెసిడెంట్ యం జి నవాబ్ పాషా ఆధ్వర్యంలో పాల్గొని ప్రసంసాపత్రం, శాలువ తో 25 మంది విద్యార్థులకు సత్కరించటం జరిగింది. ఈ సందర్భంగా నవాబ్ పాషా మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు మంచి విద్య ను అందిస్తు న్నాయని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమం లో నాగరాజు దేవర ప్రెసిడెంట్ ఇంపాక్ట్ ఇగ్నేటర్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంపాక్ట్ తరుపున సుప్రియ, ట్రైనింగ్ కో ఆర్డినేటర్ ,సర్వీస్ కో ఆర్డినేటర్ వి డి యస్ ప్రసాద్, రీజియన్ సెక్రటరీ యం శ్రీనివాస రావు, బి నరసింహారావు పాల్గొన్నారు. విద్యార్థుల తో పాటు తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలు రానివ్వం



- అన్ని ప్రాంతాల్లో మెరుగైన విద్యుత్ వ్యవస్థ
- లోవోల్టేజ్ ప్రాంతాల్లో సబ్ స్టేషన్ల నిర్మాణం
- విద్యుత్ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ అన్నారు. సోమవారం స్థానిక బాలాజీనగర్ 0 లైన్ రాజీవ్ గృహకల్పలో రూ. 6.5 కోట్లతో 33/11 కేవీ ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ ఉప కేంద్రం ద్వారా మార్గం చూపబోతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలపై విద్యుత్ భారం లేకుండా చూస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ విధించిన ట్రూ అప్ చార్జీలను తగ్గించి ప్రజలపై బవారం లేకుండా చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నంతకాలం విద్యుత్ ఛార్జీలు పెంచబోమని స్పష్టం చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి దక్కుతుందన్నారు. విద్యుత్ వ్యవస్థ మెరుగుపరచడానికి లోవోల్టేజ్ ప్రాంతాల్లో రూ. 6 వేల కోట్లతో నూతన సబ్ స్టేషన్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. చేనేత కార్మికులు, నాయీ బ్రాహ్మణులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించినట్లు చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకున్నామని తెలిపారు. ఏ సమయంలో విద్యుత్ సమస్య వస్తే వెంటనే తనను సంప్రదించవచ్చున్నారు.

# దేవుని సొమ్ము స్వాహా చేసిన ఘనుడిపై చర్యలు ఎక్కడ?



**ప్రొద్దుటూరు (జర్నలిస్ట్ ఫైల్):** కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గం ప్రొద్దుటూరు టౌన్ నందు వెలసి ఉన్న పురాతన హిందూ దేవాలయం గోల్డ్ ను (గోల్డ్ స్థానంలో నకిలీ గోల్డ్ ను అమర్చి) రెండు కోట్లరూపాయలమేరకు అవినీతికి పాల్పడిన ఎండోమెంట్ అధికారి శంకర్ బాలాజీని సస్పెండ్ చేసి అధికార దుర్వినియోగం చేసిన బంగారాన్ని నిధులను రికవరీ చేయాలని దేవాలయ పరిరక్షణ సమితి అధ్యక్షులు మాజీ బిజెపి కడప జిల్లా అధ్యక్షులు పుప్పాల శ్రీనాథ్ రెడ్డి మరియు విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఇతర ధార్మిక సంస్థల మరియు ప్రజల ఆధ్వర్యంలో సోమవారం ప్రొద్దుటూరు నాలుగు రోడ్ల కూడలి యందు శివాలయం ఎదురుగా ధర్నా చేపట్టడం జరిగింది. అధికారులు ఇంత జరుగుతున్నా చోద్యం చూస్తున్నారని ఎద్దేవా చేశారు. తక్షణమే అధికారిని సస్పెండ్ చేసి బంగారం రికవరీ చేయాలని వారు డిమాండ్ చేశారు. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ వివరణ నిమిత్తం ఫోన్ చేయగా అతను ఫోన్ స్పందించలేదు.

# హైస్కూలు భవన నిర్మాణానికి జడ్పీ అనుమతి

**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండపాటూరు జడ్పీ హైస్కూలు భవనం నిర్మించడానికి అడ్డుగా ఉన్న మూడు పాత గదులు తొలగించడానికి, సోమవారం సాయంత్రం జడ్పీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీని విషయమై ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు జడ్పీవారిని హెచ్చరించడం, వివిధ దిన పత్రికలలో వార్తలు రావడంతో ఆగమేఘాలపై ఇంజినీరింగ్ అధికారులు శనివారం కొండపాటూరు వచ్చి హైస్కూలు స్థల పరిశీలన చేసిన విషయం తెలిసిందే. కాటూరి మెడికల్ కాలేజీ హాస్పిటల్ అధినేత కాటూరి సుబ్బారావు తన జన్మభూమి కొండపాటూరులో హైస్కూలు భవన నిర్మాణానికి కోటి రూపాయలు డిపాజిట్ చేసినప్పటికీ నెలన్నర రోజులుగా దాని నిర్మాణానికి జడ్పీవారు అనుమతి ఇవ్వకపోవడంపై హైస్కూలు అభివృద్ధి కమిటీ కన్వీనరు టి.డి. ప్రసాద్ ఈ ఉదంతాన్ని వెలికి తెచ్చారు. దీంతో జిల్లా పరిషత్ ఈఈ సంపత్ కుమార్, డీఈ భానుప్రకాష్, ఏఈ మన్మదయ్యలు వచ్చి హైస్కూలును సందర్శించి డాక్యుమెంట్లు, సమకూర్చనున్న సౌకర్యాలపై వివరించగా వారు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ మేరకు జిల్లా పరిషత్ అధికారులు హైస్కూలు భవనం నిర్మించడానికి అడ్డుగా ఉన్న పాత భవనం తొలగించడానికి ఉత్తర్వులు జారీ చేశారు.

# తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యురాలు ఎమ్మెల్యే గళ్ళా మాధవికి ఘన సన్మానం

- అన్నదాన సమాజం నూతన కమిటీకి దిశానిర్దేశం చేసిన గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యురాలు నియమితులైన సందర్భంగా అమరావతి రోడ్డులోని అన్నదాన సత్రంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన సమాజం నూతన పాలక మండలి సభ్యులను ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముందు విద్యానగర్ నుండి అన్నదాన సత్రం వరకు భారీ ర్యాలీ నిర్వహించగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ర్యాలీ సందర్భంగా తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్టీఆర్ విగ్రహానికి, చంద్రమౌళి నగర్‌లోని చాకలి ఐలమ్మ విగ్రహానికి, లాడ్జి సెంటర్‌లోని బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ అన్నదాన సమాజం, అన్నదాన సత్రం ఏ ఉద్దేశంతో స్థాపించబడిందో అదే ఆశయంతో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, గతంలో ఈ సత్రంపై అనేక అపోహలు, విమర్శలు, అవినీతి ఆరోపణలు వచ్చాయని, కొందరు సేవా భావం కంటే స్వప్రయోజనాల కోసం వ్యవహరించారనే అభిప్రాయం ప్రజల్లో ఏర్పడిందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. అయితే నేటి నుంచి మంచి కమిటీ బాధ్యతలు చేపట్టిందని, అందరూ చేయి చేయి కలిపి సేవా దృక్పథంతో పనిచేసి అన్నదాన సమాజాన్ని మరింత గొప్ప స్థాయికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

అన్నదాన సమాజ అభివృద్ధికి ఏ సహాయం కావాలన్నా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు. కమిటీ సభ్యులు తమ తమ ఆలోచనలు, శక్తి, అనుభవాన్ని వినియోగించి ప్రజలకు ఉపయోగపడే విధంగా ఈ సంస్థను తీర్చిదిద్దాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ బీసీ సమాజానికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తూ ఒక అవకాశం ఇచ్చిందని, ఆ అవకాశాన్ని నిలబెట్టుకోవడం మరింత గొప్ప బాధ్యత అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. "అవకాశం రావడం గొప్ప... దాన్ని నిలబెట్టుకోవడం ఇంకా గొప్ప" అని స్పష్టం చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నా ప్రజల మధ్య బిడ్డలా, చెల్లెల్లా, అక్కలా ఉంటానని, ప్రజల ప్రేమాభిమానాలే తన బలం అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గం రాష్ట్రంలో 12వ స్థానం, జిల్లాలో మొదటి స్థానం సాధించడం ఒక్క ఎమ్మెల్యే విజయమే కాదని, కార్యకర్తలు, నాయకులు, ప్రజలందరి సమిష్టి కృషి ఫలితమని గళ్ళా మాధవి పేర్కొన్నారు. లక్ష్య సాధన కోసం ఒక ఐఏఎస్ అభ్యర్థి ఎంత కష్టపడతాడో, అలాగే తాను కూడా నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నానని చెప్పారు. బీసీ నాయకత్వం మరింత బలపడాలని, బీసీ సమాజంలో ఐక్యత పెరగాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. "బీసీల్లో నిబద్ధత, నిజాయితీ, విధేయత ఎక్కువగా ఉంటాయి. అందరం కలిస్తే బీసీ నాయకత్వం మరింత బలపడుతుంది" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. సమాజంలో అందరూ కలిసి పనిచేస్తే గుంటూరు పశ్చిమ నియోజకవర్గం రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలుస్తుందని తెలిపారు.

గత ఐదేళ్ల పరిస్థితులను గుర్తుచేస్తూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని బలపరచాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రజలకు సేవ చేసే నాయకత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

# క్లస్టర్ కంపోస్టుల్లో నూరు శాతం ఎరువు తయారీ చేపట్టాలి

- కమిషనర్ మయూర్ అశోక్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** నగరంలోని అన్ని క్లస్టర్ కంపోస్టుల్లో నూరు శాతం కంపోస్ట్ తయారీ చేపట్టాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. సోమవారం 17వ డివిజన్ పరిధిలోని ఐపిడి కాలనీ, ఉడా రోడ్, బొంతపాడు డొంక ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్ పారిశుధ్య పనుల తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఐపిడి కాలనీలోని రిజర్వాయర్ వద్ద ఉన్న క్లస్టర్ కంపోస్ట్ కేంద్రాన్ని పరిశీలించిన ఆయన, ప్రతి కేంద్రంలో ఎరువు తయారీ జరిగేలా చర్యలు తీసుకోవాలని, స్థానిక ప్రజలకు కంపోస్ట్ తయారీపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటింటికీ చెత్త సేకరణ తడి, పొడి వ్యర్థాలుగా వేర్వేరుగా జరగాలని, అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక గ్యాంగ్ వర్క్‌లు ఏర్పాటు చేసి పారిశుధ్య పనులు నిర్వహించాలని ఆదేశించారు.

భవన నిర్మాణ సామగ్రి, వ్యర్థాలు రోడ్ల పక్కన పేరుకుపోవడాన్ని గమనించిన కమిషనర్ వాటిని వెంటనే తొలగించాలని సూచించారు. ఐపిడి కాలనీలో యూపీహెచ్ వద్ద డ్రైన్ నిర్మించాలని స్థానికులు కోరడంతో అంచనాలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. అనంతరం ఉడా రోడ్డులో కచ్చా డ్రైన్‌లో మురుగునీరు నిల్వ ఉండటాన్ని గమనించి సిల్ట్ తొలగించాలని సూచించారు. బొంతపాడు డొంక వద్ద పీకలవాగులో జరుగుతున్న సిల్ట్ తొలగింపు పనులను పరిశీలించి తొలగించిన సిల్ట్‌ను ప్రజలకు ఇబ్బంది కలగకుండా వెంటనే తరలించాలని ఆదేశించారు. నగరంలోని ప్రధాన డ్రైన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువగా పడుతున్న ప్రాంతాలను గుర్తించి ఐరన్ మెష్‌లు ఏర్పాటు చేసి ప్లాస్టిక్‌ను ఎప్పటికప్పుడు తొలగించాలని ప్రజారోగ్య అధికారులకు సూచించారు. పర్యటనలో ప్రజారోగ్య అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, కార్యదర్శులు, ఎస్ఎస్‌లు పాల్గొన్నారు.

# సంస్కృతి సంప్రదాయాలను ముందు తరాలకు అందించే మ్యూజియంలు




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ప్రతి దేశ సంస్కృతి సంప్రదాయాలు తరువాతి తరాలకు అందించటానికి మ్యూజియంలు ఎంతో అవసరం. పాత రాతియుగం నాటి మానవుని ఆయుధాల వద్దనుండి ప్రస్తుతం ఉన్న అదునాతన టెక్నాలజీ ని కూడా ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు చేరువచేయటానికి ఈ ప్రదర్శన శాలలు అత్యవసరం అటువంటి ప్రదర్శన శాలల గురించి ప్రజలకు అవగాహన కల్పించటానికి 1977 లో మాస్కోలో జరిగిన అంతర్జాతీయ మ్యూజియం ల సంస్థ ప్రతి సంవత్సరం మే 18 వ తారీఖున ప్రపంచ మ్యూజియంల దినోత్సవంగా నిర్వహించాలని తీర్మానించింది. అప్పటి నుండి ఈ రోజున పలు కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

వీటిలో భాగంగా ఈ రోజు గుంటూరు నగరంలోని బౌద్ధ సిరి మ్యూజియంలో కూడా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక సంస్థ, ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఆఫ్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ లు సంయుక్తంగా నిర్విహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులను మ్యూజియం కు తీసుకువచ్చి, దాని ప్రాశస్త్యాన్ని ప్రముఖ చరిత్ర నిపుణులు శ్రీనాథ్ రెడ్డి వారికి అర్థమయే రీతిలో వివరించారు. అలాగే మ్యూజియం రంగంలో ఉన్న ఉపాధి అవకాశాల గురించి కూడా ఆయన విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో పాల్గోన్న విద్యార్ధలు, తమకు తెలియని ఎన్నో విషయాలను ఈ రోజు తెలుసుకున్నామని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇంటాక్ గుంటూరు చాప్టర్ కన్వీనర్ ముదిగోండ రవిశంకర్, గుంటూరు జిల్లా పర్యాటక అధికారి రమ్య, ఇంటాక్ కో కన్వీనర్ వేణుగోపాల్, సభ్యులు జాస్తి వీరాంజనేయులు, విజయ్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గోన్నారు. కార్యక్రమానికి మేకల రవీంద్ర తనవంతు సహకారన్ని అందించారు.

# బక్రీద్ సమయంలో గో వధ జరగరాదు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** : జంతు వధ నిషేధిత చట్టం కింద గో వధ జరగరాదని జిల్లా కలెక్టర్ సి.యం.సాయి కాంత్ వర్మ అన్నారు. గో వధ నిషేధం మరియు జంతు వధ నివారణ చట్టం, 1977 క్రింద బక్రీద్ రోజున గో వధ, ఇతర అనధికార జంతువుల వధపై జిల్లా కమిటీ సమావేశం సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. అధీకృత స్థలంలో మినహా బయట ఎక్కడ జంతు వధ జరగరాదని చెప్పారు. గోవులను వధించరాదని, అధికారికంగా ధృవీకరించిన గొర్రెలు, మేకలను మాత్రమే వధింపుటకు అనుమతించడం జరుగుతుందని తెలిపారు. పోలీస్ శాఖ స్పష్టమైన పర్యవేక్షణ చేయాలని, కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని ఆదేశించారు. మున్సిపాలిటీల పరిధిలో ఉన్న అధీకృత జంతు వధ శాలలను గుర్తించాలని, తాత్కాలిక జంతు వధ శాలలకు దరఖాస్తు చేసిన వారికి నిబంధనలు మేరకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. డివిజనల్ స్థాయి కమిటీలు జంతు వధ శాలలకు సంబంధించి సూచనలు, సలహాలు అందించాలని ఆదేశించారు. జంతు రవాణాను పక్కాగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ మాట్లాడుతూ బక్రీద్ రోజున గో వధ జరగరాదన్నారు. గో వధ జరగకుండా పర్యవేక్షణకు పశు సంవర్ధక శాఖ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. మూడు సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ఎద్దులను కూడా వధించరాదని అన్నారు. దేనికి ఉపయోగపడదని అధికారికంగా ధృవీకరించిన తరువాత మాత్రమే వధించుటకు అవకాశం ఉందని చెప్పారు. గర్భం దాల్చిన ఏ జంతువును వధించరాదని పేర్కొన్నారు. ఒంటెలను కూడా వధించరాదని చెప్పారు. ఈ సందర్భంగా పోస్టర్లను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు.

ఈ సమావేశంలో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, తెనాలి ఇన్ ఛార్జ్ సబ్ కలెక్టర్ లక్ష్మీ కుమారి, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పార్థసారథి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్, ఆర్.టి.ఓ శ్రీహరి, గో సంరక్షణ కమిటీ సభ్యులు హరి హర రాయలు, బి.వి.శివ రావు, దాసరి రాము, జాగు నరసింహా రావు తదితరులు పాల్గొన్నారు.

# పెనుమాక బీసీ బాలుర వసతి గృహం నిర్మాణం వేగవంతం



- మంత్రి నారా లోకేష్ చొరవతో రూ.3.50 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆధునిక హాస్టల్ నిర్మాణం

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల కింద తాడేపల్లి మండలం పెనుమాకలో రాడికో ఖైతాన్ లిమిటెడ్ సహకారంతో రూ. 3.50 కోట్ల వ్యయంతో ఆధునిక బీసీ బాలుర వసతి గృహం నిర్మాణం శరవేగంగా సాగుతోంది.

మంగళగిరి నియోజకవర్గంలో బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ వసతి గృహాలను మోడల్ హాస్టళ్లుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మంత్రి నారా లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అందులో భాగంగానే పెనుమాకలో నిర్మాణంలో ఉన్న ఈ బీసీ బాయ్స్ హాస్టల్ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పించేలా రూపుదిద్దుకుంటోంది.

ఈ హాస్టల్‌లో ప్రీ మెట్రిక్, పోస్టుమెట్రిక్ విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని దాదాపు 150 నుండి 170 మంది విద్యార్థులకు వసతి కల్పించేలా నిర్మాణం చేపట్టారు. ఆధునిక కిచెన్, విశాలమైన డైనింగ్ హాల్, లివింగ్ రూమ్స్, డార్మెటరీలు, స్టడీ హాల్ వంటి సదుపాయాలతో హాస్టల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ పనులు దాదాపు పూర్తి దశకు చేరుకున్నాయి. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యంగా హాస్టల్‌ను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయాలని మంత్రి నారా లోకేష్ సంకల్పించారని, అందుకు అనుగుణంగా అన్ని సౌకర్యాలతో ప్రణాళికాబద్ధంగా నిర్మాణం కొనసాగుతోంది.

# కూటమి ప్రభుత్వానిది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వం : ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

- వినుకొండలో రైతులకు రూ. 30.33 లక్షల వడ్డీ లేని రుణాలు పంపిణీ



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్):** రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పెట్టుబడుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలు కాకూడదనేదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు స్పష్టం చేశారు. సోమవారం వినుకొండ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో 18 మంది రైతు సోదరులకు, వారు నిలువ చేసుకున్న ధాన్యం ఆధారంగా రూ. 30 లక్షల 33 వేల వడ్డీ లేని రుణాల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. పంట చేతికి రాగానే మార్కెట్లో తక్కువ ధరకే అమ్ముకుని రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతోనే మార్కెట్ యార్డ్ గిడ్డంగిలో ధాన్యం భద్రపరుచుకునే సదుపాయాన్ని కల్పించామని, అలా నిలువ చేసుకున్న రైతులకు తక్షణ పెట్టుబడి ఖర్చుల కోసం వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ ఈ రోజు పెద్ద మొత్తంలో రుణ సహాయం అందించి అండగా నిలిచిందని చెప్పారు. ముఖ్యమంత్రి గారి నేతృత్వంలో నడుస్తున్న ఈ ప్రభుత్వం కేవలం మాటల ప్రభుత్వం కాదని, రైతుల సంక్షేమానికి కట్టుబడిన చేతల ప్రభుత్వమని కొనియాడారు.

ప్రకృతి వైపరీత్యాలు, కరవు లేదా అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు భారం పడకుండా, ఒక్క రూపాయి ప్రీమియం కూడా లేకుండా ప్రభుత్వమే ఉచిత పంటల బీమాను అమలు చేస్తోందని, పంట నష్టపోయిన రైతులకు భరోసా కల్పిస్తూ అదే సీజన్ ముగిసేలోపు ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకుంటున్నామని తెలిపారు. రైతులకు పగటిపూటే 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందిస్తూ వ్యవసాయాన్ని పండుగలా మారుస్తున్నామని, విత్తనం నుండి విక్రయం వరకు అండగా ఉండేందుకు గ్రామ స్థాయిలోనే రైతు సేవా కేంద్రాలను (ఆర్బీకేలు) ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలు, ఎరువులను ఇక్కడే అందిస్తున్నామని వివరించారు. ప్రతి రైతు సాగు చేసిన పంటను డిజిటల్ పద్ధతిలో నమోదు (ఈ-క్రాపింగ్) చేయడం ద్వారా కనీస మద్దతు ధర (మీఎస్పీ), బీమా మరియు సున్నా వడ్డీ రుణాల అర్హతను పారదర్శకంగా కల్పిస్తున్నామని, చిన్న, సన్నకారు రైతులకు మేలు చేసేలా భారీ సబ్సిడీపై ట్రాక్టర్లు, ఆధునిక వ్యవసాయ పనిముట్లను గ్రూపుల ద్వారా అందించి యాంత్రీకరణకు ఊతం ఇస్తున్నామని చెప్పారు.

ఇదే వేదికపై ఇంధన పొదుపు, దేశ రక్షణ అంశాలపై జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ, "దేశభక్తి కూటమిది.. రాజకీయ స్వార్థం జగన్ ది" అని విమర్శించారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం తలెత్తిన సమయంలో, ఇంధనాన్ని ఆదా చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ గారు పిలుపునిస్తే, దాన్ని ఒక దేశభక్తిగా స్వీకరించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఇంధన పొదుపు చర్యలకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. ప్రధాని ఆలోచనలను ఆచరణలో పెడుతూ సీఎం చంద్రబాబు ప్రజాప్రతినిధులందరికీ ఆదర్శంగా నిలిస్తే, ప్రభుత్వ చీఫ్ విప్ గా నా కాన్వాయిని భారీగా తగ్గించుకుని, ఈవీ వాహనాలు మరియు సైకిల్ వాడకాన్ని ప్రారంభించడం మా కూటమి ప్రభుత్వ దేశభక్తికి నిదర్శనమన్నారు.

ఇంధన పొదుపులో భాగంగానే రాష్ట్రంలో భారీ ఎత్తున సోలార్ విద్యుత్తును ప్రోత్సహిస్తున్నామని, సామాన్యులపై భారం పడకుండా కరెంటు చార్జీలు కూడా పెంచకుండా పాలిస్తున్న ఘనత మా కూటమి ప్రభుత్వానిదని, పేద వర్గాలకు అండగా నిలుస్తూ భారీ ఎత్తున సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసుకునేలాగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పెద్దపీట వేస్తూ రాయితీలు కల్పిస్తున్నామని చెప్పారు. దేశ రక్షణ, రాష్ట్ర ప్రగతి కోసం తాము ఇంధన పొదుపుపై, ప్రత్యామ్నాయ ఇంధనాలపై అడుగులు వేస్తుంటే, దాన్ని కూడా రాజకీయం చేస్తూ జగన్ రెడ్డి నంగనాచి మాటలు మాట్లాడటం కేవలం ఆయన రాజకీయ స్వార్థం మాత్రమేనని మండిపడ్డారు.

గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, 2019లో పెట్రోల్ రూ. 76, డీజిల్ రూ. 68 ఉంటే.. కేవలం ఏడాది కాలంలోనే, అంటే 2020 నాటికి పెట్రోల్‌ను రూ. 107, డీజిల్‌ను రూ. 99కి చేర్చి, లీటరుకు రూ. 31 పెంచి ప్రజల నడ్డి విరిచిన జగన్ రెడ్డికి ఇంధన ధరల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. నాడు అధికార స్వార్థంతో రోడ్డు సెస్, వ్యాట్, అదనపు వ్యాట్ అంటూ రకరకాల పన్నుల పేరుతో ప్రజలపై మోయలేని భారం మోపిన ఘనత గొడ్డలి పార్టీదని, మా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో రాష్ట్ర ప్రజలపై రూపాయి కూడా అదనపు పన్ను వేయకుండా బాధ్యతగా పాలిస్తుంటే, జగన్ రెడ్డి మాత్రం తన రాజకీయ పబ్బం గడుపుకోవడానికి అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. పశ్చిమాసియా యుద్ధం వల్ల అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగి గత వారం కేవలం రూ. 3 మాత్రమే పెరిగితే, దాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి ఆపాదిస్తూ జగన్ డ్రామాలు ఆడటం ఆయన రాజకీయ దివాళాకోరతనానికి నిదర్శనమన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మురళీకృష్ణ యాదవ్, అధికారులు, స్థానిక కూటమి నాయకులు మరియు రైతు సోదరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

